
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 10 డిసెంబరు 2024



• మండలికి వెళ్లొద్దన్న ఆదేశాలను పాటించని ఏసురత్నం • సోషల్ సైకోల వ్యవహారంలో చంద్రగిరిపై అధిష్ఠానం గుర్రు • తప్పు ఎవరు చేసినా తప్పే అన్న మాజీ పోలీసు అధికారి • జగన్ వైఖరితో విసుగు.. జనసేన వైపు చూపు



ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

జొన్నలు, రాగులు కట్!





- రేషన్‌లో ఒక్క నెలకే ఆగిన పంపిణీ
- కిందటి నెలలో మిగిలినవే ఈ నెల పంపకం
- ఒక్కో షాపునకు 2 క్వింటాళ్లతో సరి
- గత ప్రభుత్వ నిర్వాకంతో నేటికీ తప్పని కష్టాలు



గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నవంబరు నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా నాలుగు రకాల సరుకులు అందజేస్తామని ప్రకటించిన పౌర సరఫరాల శాఖ రెండో నెలలోనే తడబాటుకు గురయింది. బియ్యం, పంచదార, కందిపప్పు మూడింటి తోపాటు నాలుగో సరుకుగా చిరుధాన్యాలైన రాగులుగానీ, జొన్నలుగానీ, సజ్జలుగానీ ఇస్తామని ప్రకటించింది. రాయలసీమ రైతులు పండించిన చిరుధాన్యాన్ని కొనుగోలు చేసి, ప్రజా పంపిణీ ద్వారా పేదలకు చౌకగా అందిస్తే అటు రైతులకు, ఇటు పేద ప్రజలకు బలవర్ధక ఆహారం దొరుకుతుందని భావించిన ప్రభుత్వం వరుసగా రెండు నెలలు రాగులు, జొన్నలు పంపిణీ చేసింది. చెప్పిన విధంగా కార్డుదారులకు అక్టోబరులో రాగులు, నవంబరు నెలలో జొన్నలు అందజేసిన ఆ శాఖ డిసెంబరు నెల వచ్చేసరికి చేతులెత్తేసింది.

నాటి పాపాలే.. నేటి శాపాలు

గత వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు చౌక ధరలో సరుకులు అందజేసే రేషన్ షాపులను కేవలం బియ్యం అందజేసే షాపులుగా పరిమితం చేసింది. రేషన్ కార్డులను కూడా బియ్యం కార్డులుగా కుదించి సరుకులు ఆపేసింది. దానికి తోడు పౌర సరఫరాల కార్పొరేషన్‌పై భారీ మొత్తంలో రుణాలు తెచ్చి కార్పొరేషన్‌ను నిండా ముంచేసింది. వీటిని సరిదిద్దుకోవడం, కొత్త సరుకులు కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సవాలుగా మారింది. దీంతో సరుకుల పంపిణీ సమస్యాత్మకంగా మారింది. అనారోగ్య బాధితులకు అత్యవసరంగా మారిన ఈ ధాన్యాలను అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బాధితులు కోరుకుంటున్నారు. అయితే తిరిగి జొన్నలు, రాగులు, సజ్జల పంపిణీ ఉంటుందా లేదా అన్నది మాత్రం అధికారులు కచ్చితంగా చెప్పలేకపోతున్నారు.

ఆరంభంలోనే అంతరాయం

2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు అనేక సరుకులు అందించింది. బియ్యం, పంచదార, కందిపప్పుతోపాటు పామాయిల్, ఉప్పు, చింతపండు వంటి అనేక సరుకులు అందించింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పౌర సరఫరాల శాఖ కోలుకోలేనంతగా దెబ్బతింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. పేదలకు దూరమైన రేషన్ సరుకులను ఒక్కొక్కటిగా పేదలకు అందించేలా చర్యలు చేపట్టింది. ఒక్కో నెల ఒక్కో సరుకును పెంచుకుంటూ పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తూ వస్తోంది. ఆ క్రమంలోనే ఈ జూలై నుంచి బియ్యం, పంచదారతోపాటు కందిపప్పును అందుబాటులోకి తెచ్చింది. అక్టోబరులో వాటితోపాటు రాగులు అందించింది. తాజాగా నవంబరు నెలలో రాగులకు బదులుగా జొన్నలు అందజేసింది. డిసెంబరు వచ్చే సరికి పరిస్థితి తారుమారయిపోయింది. ఈ నెల అదనంగా ఇస్తానన్న రాగులు, జొన్నలు, సజ్జలు అందుబాటులోకి రాలేదు. గత నెలలో కార్డుదారులు తీసుకోకపోవడంతో మిగిలిన జొన్నలను అధికారులు పంపిణీకి సిద్ధం చేశారు. ఇలా ఒక్కో రేషన్ షాపుకు ఒకటి, రెండు క్వింటాళ్లకు మించి జొన్నలు అందలేదు. దీంతో తొలి రోజు అందుకున్న కార్డుదారులకు మాత్రమే అవి దక్కాయి. ఫలితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ విమర్శలకు గురయింది.

ఎప్పుడు వస్తాయో చెప్పలేం

జీ లక్ష్మి, డీఎం పౌర సరఫరాల శాఖ

రాయలసీమ రైతులకు ఊతం ఇచ్చేలా వారు పండించే జొన్నలు, రాగులు, సజ్జలను పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు అందించాలని భావించాం. అక్టోబరులో రాగులు, నవంబరులో జొన్నలు అందజేశాం. మళ్లీ అవి అందుబాటులోకి ఎప్పుడు వస్తాయో తెలియదు. అందుబాటులోకి వస్తే తిరిగి వాటిని పంపిణీ చేస్తాం.

మరో ఎమ్మెల్సీ

జగన్ వైఖరి ఆ పార్టీ నేతలకే నచ్చటం లేదా ? వైసీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆ పార్టీకి దూరం అవుతున్నారా..? ఆయన రేపో మాపో పార్టీ మారనున్నారా..? ఈ ప్రశ్నలకు సమాధానం అవుననే అనిపిస్తుంది. గత కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఎమ్మెల్సీ ఏసురత్నంకి ఆ పార్టీ నాయకత్వానికి మధ్య దూరం పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన త్వరలో పార్టీకి గుడ్ బై చెప్పనున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరో వైపు జనసేన నాయకులు కూడా ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ఆయన త్వరలో జనసేన తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది.

వైసీపీకి గుడ్ బై..?

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ముగిసిన శాసన మండలి సమావేశాలు ఎమ్మెల్సీ ఏసురత్నంకి వైసీపీ అధిష్ఠానానికి మధ్య చిచ్చు రేపినట్లు సమాచారం. జగన్ అసెంబ్లీకి వెళ్ళటం లేదు కాబట్టి ఎమ్మెల్సీలు కూడా శాసనమండలికి వెళ్లాల్సిన పనిలేదని వైసీపీ అధిష్ఠానం ఆ పార్టీ సభ్యులకు హుకుం జారీచేసినట్లు సమాచారం. ఒకవేళ సమావేశాలకు వెళ్లినా అధికార కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చిపోవాలని సూచించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఏసురత్నం ఈ రెండు మాటలను పెడచెవిన పెట్టినట్లు చెబుతున్నారు. సమావేశం జరుగుతుంటే ఇంట్లో ఎలా కూర్చోవాలి అంటూ మండలికి వెళ్ళారు. దానిపై ముఖ్య నేతలు తీవ్రంగా హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది.

పోడియం దగ్గరకు ఎందుకు వెళ్ళలేదు...

ఈ సమావేశాల్లో సోషల్ మీడియా సైకోల అరెస్టులపై శాసనమండలిలో కొద్దిపాటి గొడవ జరిగింది. అన్యాయంగా తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ ఎమ్మెల్సీలు పోడియంను చుట్టుముట్టారు. ఆ సమయంలో ఏసురత్నం మండలిలోనే ఉన్నా పోడియం దగ్గరకు వెళ్ళలేదు. దానిపై వైసీపీ అధిష్ఠానం ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు ముఖ్య నేతలు ఈ విషయం ఏసురత్నం వద్ద ప్రస్తావించగా ఆంధ్రప్రదేశ్ పోలీసులు అన్యాయంగా ఎవరినీ అరెస్టు చేసే అవకాశం లేదని చెప్పినట్లు సమాచారం. ఒక మాజీ

(మిగతా 8వ పేజీ)

- రీ షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే రెండు సార్లు వాయిదా
- 14న నీటి సంఘాలకు.. 17న డీసీలకు ఎన్నికలు

సాగునీటి సంఘాల ఎన్నికలకు...
రేపు నోటిఫికేషన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. 11న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఇప్పటికే రెండు సార్లు ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. 14న నీటి సంఘాలకు.. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేస్తారు. ఎన్నికల నిర్వహణకు జలవనరుల, రెవెన్యూ శాఖలు ఏర్పాటు చేస్తున్నాయి. ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఇప్పటికే కూటమి నేతలు రైతులకు పిలుపునిచ్చారు. వైసీపీ అంతగా ఈ ఎన్నికలపై దృష్టి సారించలేదు. పూర్తిగా బలం ఉన్న చోట మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయాలని వైసీపీ భావిస్తోంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఒకసారి, వర్షాల కారణంగా మరోసారి నీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. రీషెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 14న సాగునీటి సంఘాలకు.. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పటిష్ఠమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. నీటి సంఘాల టీసీలకు 14న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు సంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాలువ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు.



గుంటూరు బ్రాంచ్ కెనాల్

కుడి కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఇవే..

కుడి కాలువ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి

(మిగతా 8వ పేజీ)

విద్యుత్‌శాఖకు.. బకాయిల గుదిబండ

- ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన బిల్లులు
- ఉమ్మడి జిల్లాలో బకాయిలు రూ. 470 కోట్లు పైనే...

గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖకు ప్రభుత్వ శాఖల విద్యుత్ బిల్లులు గుదిబండలా మారాయి. అసలే నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతోన్న విద్యుత్ పంపిణీ సంస్థలకు బకాయిలు మరింత కుంగదీస్తున్నాయి. సీపీడీసీఎల్ పరిధిలోని గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్‌లో మొత్తం రూ. 470 కోట్లు పైనే విద్యుత్ బిల్లుల బకాయిలున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన బిల్లులు పెద్ద ఎత్తున పేరుకుపోవటంతో ఇప్పుడు అవి కాస్త మోయలేని భారంగా మారాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సీఆర్‌డీఏ, గుంటూరు సర్కిల్స్ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు ఎల్‌టీ కేటగిరిలోనే చెల్లించాల్సిన బిల్లులు విద్యుత్‌శాఖకు భారంగా మారాయి. ప్రభుత్వ శాఖలైన పంచాయతీలు, మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ఇతర శాఖల కార్యాలయాల నుంచి రావాల్సిన బిల్లుల బకాయిలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆయా బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చూపటంతోనే బిల్లులు వందల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని విద్యుత్‌శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క గుంటూరు సర్కిల్ పరిధిలో చూస్తే రూ. 365 కోట్లు బకాయిల రూపంలో ఉన్నట్లు సమాచారం. అలానే రాజధాని సీఆర్‌డీఏ సర్కిల్‌లో కూడా రూ. 105 కోట్లు పైనే ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మొత్తంగా రూ. 470 కోట్లుపైనే బకాయిలు ఉన్నాయి. ఇప్పటికే బకాయిల వసూళ్ళ కోసం పలు దఫాలుగా అధికారులు నోటీసులు అందజేశారు. భారీగా పేరుకుపోయిన బకాయిలు డిస్కంపై పెను భారంగా మారింది. ఇప్పటికే నష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న సీపీడీసీఎల్‌కు కేవలం ఎల్‌టీ (లో టెన్షన్) కేటగిరిలో మాత్రమే వందల కోట్లు బకాయిలు పేరుకుపోగా హెచ్‌టీ (హై టెన్షన్) అదనంగా బకాయిలున్నట్లు సమాచారం.

బకాయిల కోసం నోటీసులు అందజేశాం



• గుంటూరు సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ కేవీఎల్ఎన్ మూర్తి

గుంటూరు సర్కిల్ పరిధిలో విద్యుత్ బకాయిల వసూళ్ళపై ఇప్పటికే ఫోకస్ పెట్టాం. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు కూడా చేస్తున్నాం. ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్ళ కోసం నోటీసులు జారీ చేశాం. బకాయిల వసూళ్ళలో క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం చూపకుండా ఉండేలా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం.

11,12 తేదీలలో... తాగునీటి సరఫరా నిలిపివేత

కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 11, 12 తేదీల్లో గుంటూరు పట్టణానికి నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ప్రకటించారు. గుంటూరు నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్ కు ఉండవల్లి నుండి తాగునీటి సరఫరా జరిగే పైప్ లైన్‌కు తక్కెళ్లపాడు గ్రామంలో ఏర్పడిన లీకు మరమ్మతుల కోసం నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన వివరించారు. బుధవారం సాయంత్రం నుండి గురువారం సాయంత్రం వరకు గుంటూరు పట్టణంలోని నెహ్రూనగర్, శారదా కాలనీ, వసంతరాయపురం, హెచ్ఎల్ఆర్, ఐపీడీ కాలనీ, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, విద్యానగర్, హనుమయ్య నగర్, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, తారకరామ నగర్, ఏటి అగ్రహారం, బీఆర్ స్టేడియం, ఎల్బీనగర్, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్‌గాంధీ నగర్, కోర్ట్ కాంపౌండ్, మిర్చియార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కేవీపీ కాలనీ, శ్యామలానగర్, రెడ్డిపాలెం రిజర్వాయర్ల పరిధిలో పూర్తిగా తాగునీటి సరఫరా ఉండదు. శుక్రవారం ఉదయం నుండి యధావిధిగా సరఫరా జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ రెండు రోజులూ నగర ప్రజలు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

పట్టభద్రుల ఓటు కోసం.. కొత్తగా 63,607 దరఖాస్తులు

- రాత్రి 8.15 గంటల వరకు వచ్చిన వివరాల విడుదల
- అర్ధరాత్రి 12 గంటలకు మరికొన్ని పెరిగే అవకాశం

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఓటరు నమోదు ప్రక్రియకి సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 63,607 దరఖాస్తులు అందాయి. సోమవారం రాత్రి 8.15 గంటల వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎలక్టోరల్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి విడుదల చేశారు. కాగా అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తుల దాఖలుకు గడువు ఉన్నందున ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉందన్నారు. పూర్తి గణాంకాలను ఎన్నికల సంఘం మంగళవారం సాయంత్రం విడుదల చేస్తుందని చెప్పారు. బాపట్ల జిల్లాలో 4619, ఏలూరులో 1743, గుంటూరులో 23656, కృష్ణాలో 8047, ఎన్‌టీఆర్‌లో 15575, పల్నాడులో 9987 దరఖాస్తులు డ్రాఫ్ట్ పబ్లికేషన్ అనంతరం వచ్చాయన్నారు. డ్రాఫ్ట్ పబ్లిష్ చేసే నాటికి 2 లక్షల 90 వేల 978 మందికి ఓటుహక్కు కల్పించారు.

విద్యుత్తు స్తంభాలు ఎక్కడివక్కడే ఉన్నాయ్... కానీ సిమెంట్ రోడ్లు వెడల్పు చేసేస్తున్నారు. పక్కాగా సీసీ రోడ్లు వేసేస్తున్నారు. ఒకటి కాదు... రెండు కాదు రూ. కోటికి పైగా ఖర్చు చేసి ఇంతటి హడావుడిగా చేసెయ్యటానికి కారణం చూస్తే... గత వైసీపీ పాలనలో నాశిరకం పనులు చేసినవారికే మళ్లీ పనులు అప్పగించటం మినహా జనానికి ఒరుగుతున్నది మాత్రం కనిపించటంలేదు. మా పని మేము చేసుకుపోతాం... తర్వాత విద్యుత్తు శాఖ వారి పనివారు చేస్తారన్నట్టు ఒకరితో ఒకరికి సమన్వయం లేకుండా ఇష్టానుసారం ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నతీరు విమర్శలకు కారణమవుతోంది.

- విద్యుత్తు స్తంభాలు తొలగించకుండానే సీసీ రోడ్ల విస్తరణ
- మున్సిపల్, విద్యుత్తు శాఖల మధ్య సమన్వయ లోపం
- ఇంత హడావుడిగా ఎందుకో!
- గత వైసీపీ సర్కారు కాలంలో నాశిరకం పనులు చేసిన వారికే మళ్లీ

ఇవేం పనులు!

తెనాలి, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): తెనాలి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు అక్రమణలకు గురై, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిలో భాగంగానే అత్యంత రద్దీగా ఉండే బోస్‌రోడ్, బుర్రిపాలెం రోడ్లను విస్తరించే అవకాశం ఉండటంతో వాటిని విస్తరించాలని మంత్రి మనోహర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇదంతా బాగానే ఉంది. అటు జనం కూడా చాలావరకు సంతోషపడ్డారు. రోడ్లు విస్తరణ జరిగితే ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గుతుందని సంబరపడ్డారు. అయితే జరుగుతున్న పనులుచూశాక ఇవేం పనులంటూ విస్తుపోతున్నారు. దీనికి కారణం!.. రోడ్ల విస్తరణ పనులైతే చేస్తున్నారు కానీ, వాహనాల రాకపోకలకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను మాత్రం వదిలేశారు.

రోడ్డు వేశాక విద్యుత్తు స్తంభాలు తొలగించటమేంటో!

తెనాలి పట్టణంలో అత్యవసర మరమ్మతులు, రోడ్ల విస్తరణ కింద రూ. 1.22 కోట్లతో పనులు మొదలుపెట్టారు. వీటితో బోస్ రోడ్డులో ఇరువైపులా రూ. 40 లక్షలతో సిమెంట్ రోడ్డు వెడల్పు చేయటం, బుర్రిపాలెం రోడ్డులో మరో రూ. 57.5 లక్షలతో సిమెంట్ రోడ్ల విస్తరణ పనులు చెయ్యాలని నిర్ణయించారు. ఇవికాక మరో రూ. 24.60 లక్షలతో రోడ్ల మరమ్మతులు చేస్తున్నారు. అయితే ఏ ఇంజనీరింగ్ శాఖ అయినా ఒక పని మొదలుపెట్టాలనుకుంటే, దానికి సంబంధించిన సమగ్ర పరిశీలనతో అంచనాలు తయారు చేస్తారు. రోడ్లపై తొలగించాల్సిన చెట్లు, స్తంభాలు, ఇతర కట్టడాలు ఉంటే వాటిని తొలగించటం, ఆ తర్వాత పనులు చేయటం పరిపాటి. అయితే తెనాలి మున్సిపాలిటీ పరిధిలో మాత్రం దీనికి విరుద్ధంగా పనులు చేస్తుండటం విమర్శలకు కారణమవుతోంది. విద్యుత్తు స్తంభాలు, ఇతర అడ్డంకులను తొలగించి రోడ్లు వేయకుండా ముందు రోడ్లు వేసేశాక స్తంభాలు తొలగిస్తామనటం వివేషం. విద్యుత్తు స్తంభాలు తొలగించాలనుకుంటే, వారికీ టెండర్‌లు పిలవటం, వాటికి గడువు వంటివి మున్సిపల్ టెండర్ల తరహాలోనే ఉంటాయి. కానీ విద్యుత్తు శాఖకు ఒక లెటర్ పడేసి, తాము అనుకున్నట్టు పనులు చేసుకుపోతున్నారు. అదేమని అడిగితే తొలగింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, రోడ్లు వేశాకయినా స్తంభాలు తొలగిస్తామని చెప్పుకురావటం కొసమెరుపు. సిమెంటు రోడ్డు వేసేశాక విద్యుత్తు స్తంభాన్ని తీయాలన్నా, మరలా వేయాలన్నా, విద్యుత్తు శాఖకు అదనపు ఖర్చే కాంట్రాక్టర్‌కు చెల్లించాలి.అది మన పనికాదులే... విద్యుత్తు శాఖదే కదా! మాకెందుకు! మా పని జరిగిపోయిందికదా అని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సరిపెట్టుకుందామనుకున్నా, స్తంభం వేశాక మళ్లీ అతుకులు వెయ్యాల్సిందే. అదే ముందస్తు సమన్వయంతో విద్యుత్తు, మున్సిపల్ శాఖలు పని చేస్తే ఇవన్నీ తొలగిపోయి, వేసిన రోడ్డుకూడా పదికాలాలపాటు పదిలంగా ఉంటుంది. కానీ అవేమీ లేకుండా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పనులు చేసెయ్యటం విడ్డూరమే.

వైసీపీ పాలనలో నాశిరకం పనులు చేసినవారికే మళ్లీ పనులు

ఇంత హడావుడిగా చేస్తున్న పనులు జనం కోసమా! లేక కొందరు కాంట్రాక్టర్‌ల కోసమా! అనేది కూడా అనుమానం కలిగించే విషయమే. ఎందుకంటే... గత వైసీపీ సర్కారు పాలనలో అర్బన్ హెల్త్ సెంటర్‌లు, ఇతర భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్‌లకే మళ్లీ మున్సిపల్ సిమెంట్ రోడ్డు పనులు అప్పగించేశారు. పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణంలో ఉండగానే పగిలిపోవటం, కిటికీ సన్ షేడ్ విరిగిపడటం వంటి పనితనం చూపిన కాంట్రాక్టర్‌కు మళ్లీ రూ. 40 లక్షల విలువైన పనిని అప్పగించటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదు తరహాలో మిగిలిన పనులు కూడా వైసీపీ పాలనలో హవా సాగించిన వారికే కట్టబెట్టారంటూ కూటమి ప్రభుత్వంలోని నాయకులు, అభిమానులు గోల చేస్తూనే ఉన్నారు. అయినా మున్సిపాలిటీలో వారి హవానే సాగుతుందన్నట్టు దారుణంగా పనులు చేసిన కాంట్రాక్టర్‌లే మళ్లీ పనులు చేసేస్తున్నారు. దీంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మంత్రి మనోహర్ దృష్టికి కూడా వీరి వ్యవహారాన్ని తీసుకువెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. మున్సిపల్ సిబ్బంది కొందరు కావాలనే మామూళ్లు, ఇతర రాజకీయ కారణాలతో వారికే అవకాశాలు కల్పిస్తున్నారని, దీనివల్ల మనకు చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కారణమవుతున్నారనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లి నాశిరకం పనులు జరగకుండా చూడాలనే ఆలోచనలోనూ ఉన్నారు. పనులు తీరుపై మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఎంఈ శ్రీనివాసరావును వివరణ కోరితే... విద్యుత్తు స్తంభాలు తొలగించాలని విద్యుత్తు శాఖను కోరామని, వారు తొలగించేలోపు ఆలస్యం వుతుందన్న ఉద్దేశంతో పనులు చేసుకుపోతున్నామని, జనం ఇబ్బంది పడకుండా చూడాలనేదే మా ఆలోచనని వివరించారు.



బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ బాలుర పాఠశాల దగ్గర విద్యుత్తు స్తంభాలు అడ్డుగాఉన్నా, వదిలేసి సిమెంట్ రోడ్డు వేసిన చిత్రం



స్వరాజ్ టాకీస్ ఎదుట స్తంభాలు యథావిధిగా ఉంచేసి రోడ్డు వేసిన చిత్రం

కుట్లు వేయడంలో శిక్షణ తరగతులు



వాహనం లోపల రమణ యశస్వి, ఎన్‌వీ సుందరాచారి


గుంటూరు మెడికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్సల్లో రోగులకు పలు రకాల కుట్లు వేయడంలో వెలకువలు నేర్పేందుకు నాలుగు రోజులపాటు మొబైల్ వాహనంలో హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. సోమవారం వైద్య కళాశాలలో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఆధ్వర్యంలో సూచరింగ్ టెక్నిక్స్‌పై మెడికల్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఎథికాన్ పేరిట వచ్చిన ప్రత్యేక వాహనాన్ని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఎయిర్‌కండీషన్డ్ వాహనం లోపల ఏర్పాటు చేసిన పది శిక్షణ టేబుళ్లను, సూచరింగ్ మెటీరియల్స్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ సాధారణ శస్త్రచికిత్సల్లో రోగి శరీరం బయట వేసే కుట్లతోపాటు ల్యాప్రోస్కోపీ సర్జరీల్లో శరీరంలో అంతర్గతంగా వేసే సూచరింగ్‌పై కూడా ఈ వాహనంలో వైద్య విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. నాలుగు రోజులపాటు ఈ మొబైల్ ఆపరేషన్ థియేటర్ (వాహనం) వైద్య కళాశాలలోనే ఉండి గ్రూపుల వారీగా విద్యార్థులకు శిక్షణ ఇస్తారని వివరించారు.

వర్సిటీలో యోగా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి యోగా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.జాన్సన్ సోమవారం తెలిపారు. ఎంఎస్సీ యోగా రెండో సంవత్సరం లేటరల్ ఎంట్రీ (పీజీ డిప్లొమా ఇన్ యోగా చేసిన వారు) కోర్సుకు, ఎంఎస్సీ యోగా మొదటి సంవత్సరం కోర్సుకు, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంఎస్సీ యోగా రెండో సంవత్సరం లేటరల్ ఎంట్రీ కోర్సుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులుగా నిర్ణయించామని తెలిపారు. ఎంఎస్సీ యోగా మొదటి సంవత్సరం, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సుకు ఏదైనా డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. వివరాలకు 9440315340, 7396458123 సంప్రదించాలని కోరారు.

జడ్పీ పదోన్నతుల్లో జంపింగ్!

- ఒకేసారి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌గా ప్రమోషన్
- అర్హతలు.. అభ్యంతరాలను పట్టించుకోకుండానే జాబితాలు
- ఇవీ వైసీపీ హయాంలో అధికారుల అక్రమాలు



జిల్లా పరిషత్ కార్యాలయం

గుంటూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వడ్డించేవాడు మన వాడైతే బంతిలో ఏమూల కూర్చున్న ఢోకా ఉండదు అంటారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో అదే జరిగింది. పదోన్నతుల ప్రక్రియలో అర్హులను పక్కన పెట్టేసి తర్వాత వారిని అందలం ఎక్కించటం వివాదాస్పదం అయింది. కనీస నిబంధనలు పాటించకుండా జూనియర్ ఉద్యోగులకు ఏకకాలంలో రెండు పదోన్నతులు ఇవ్వటం చర్చనీయాంశంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలోని నేతలను మచ్చిక చేసుకునేందుకు కొందరు అధికారులు చిన్న ఉద్యోగుల అవకాశాలను పణంగా పెట్టారు. ఇప్పుడు ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రికి ఫిర్యాదులు వెళ్లాయి. తీగ లాగడం మొదలైంది. డొంక కదలటమే మిగిలింది.

ఒకేసారి రెండు పదోన్నతులు

2021లో ఒక ఉద్యోగికి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌గా పదోన్నతి ఇచ్చారు. దానికి కమిషనర్ ఉత్తర్వులు ఉన్నాయని చెబుతున్నారు. వాస్తవానికి ఒకే ఉద్యోగికి ఒకేసారి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ ప్రమోషన్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం. సీనియర్ అసిస్టెంట్‌గా కనీసం రెండేళ్ల పాటు పనిచేసిన తర్వాత ప్రొబేషన్ ప్రకటించాలి. ఆ తర్వాత పర్మినెంట్ సీనియార్టీ జాబితా తయారు చేయాలి. ఆ జాబితాలో ప్రొబేషన్ ప్రకటించిన ఉద్యోగి పేరును ముందుకు తీసుకువెళ్లాలంటే అతనికి ముందు ఉన్న వారందరికీ ఆ విషయం తెలియజేసి అభ్యంతరాలు స్వీకరించాలి. అప్పుడు తుది జాబితా విడుదల చేసి పదోన్నతి కల్పించాలి.

ముందు ఉన్నవారిని పక్కన పెట్టేసి..

వివాదాస్పదమైన 2021 పదోన్నతుల వ్యవహారంలో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకరికి పదోన్నతి ఇవ్వటానికి మరొకరికి అన్యాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జాబితాలో ప్రమోషన్ పొందేందుకు అర్హుడైన ఉద్యోగి ఉండగా, అతన్ని పక్కన పెట్టి అప్పటి ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన వారికి అధికారులు మేలు చేశారు. ఫలితంగా 15 ఏళ్లగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వారు అదే స్థానంలో ఉండగా, 10 ఏళ్ల క్రితం జాయిన్ అయిన వాళ్లు సూపరింటెండెంట్‌లు, ఏవోలు అయ్యారని పలువురు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

సీఎంకు ఫిర్యాదు

జిల్లా పరిషత్‌లో జరిగిన బదిలీల వ్యవహారంలోని అక్రమాలపై గత మూడేళ్లగా వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే మొన్నటి వరకు జడ్పీలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులు వక్రమార్గంలో పదోన్నతులు పొందిన వారికి అన్నిరకాలుగా అండదండలు అందించారు. ఈ అక్రమాలపై సీఎం, పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రమోషన్ పొందే అర్హతలు ఉన్నా దానికి సంబంధించిన పద్ధతి (ప్రొసీజర్) పాటించాలని గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును ఫిర్యాదుకు జత పర్చారు.

వేజండ్లలో సామాజిక పింఛన్ల తనిఖీ



సామాజిక పింఛన్లను తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

చేబ్రోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల తనిఖీ జరిగింది. వేజండ్ల గ్రామంలో 18 బృందాలు 850 సామాజిక పింఛన్లను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో అనర్హులు సామాజిక పింఛన్లు అడ్డదారిలో పొందారని ఫిర్యాదులు అందాయి. దివ్యాంగులు, ఒంటరి మహిళల పింఛన్లు అనర్హులు లబ్ధి పొందుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు రావటంతో సామాజిక పింఛన్లను తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వేజండ్ల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని సోమవారం విచారణ ప్రారంభించారు. జిల్లాలోని ఇతర మండలాలకు చెందిన అధికారులను 18 బృందాలుగా ఏర్పాటు చేసి ఈ తనిఖీని నిర్వహించారు. ఒక్కో బృందం 40 పింఛన్లను తనిఖీ చేసి నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నారు. తనిఖీలను డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి పరిశీలించి బృందానికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో డీఎల్‌డీవో కుసుమ శ్రీదేవి, ఎంపీడీవో కొప్పాక లలిత, అధికారులు పాల్గొన్నారు.

జీవో నం. 423ని రద్దు చేయండి



మున్సిపల్ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శుల పనివేళలను మారుస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 423ను తక్షణమే రద్దు చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను సోమవారం కోరారు. ఈ మేరకు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ పనివేళలు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు మున్సిపల్ శాఖలో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌లో, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో, ఫుడ్ సేఫ్టీ శాఖల్లో పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు జనన-మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్స్, మ్యారేజ్ సర్టిఫికెట్లు మంజూరు చేసే అధికారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశుధ్య పర్యావరణ వెల్ఫేర్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు, నాయకులు భాను ప్రకాష్, రఫీ, రమేష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ సైన్సు, అగ్రికల్చర్ కోర్సులకు అడ్మిషన్లు

గుంటూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ కమ్యూనిటీ సైన్సు, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ఎన్ఆర్ఐ కోటా కింద ఈ సీట్లను భర్తీ చేయనున్నామని, అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి మొదలై 13వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు లాం ఫామ్‌లోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీస్‌లో హాజరు కావాలని తెలిపారు.

28న చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- 18న నామినేషన్‌ల స్వీకరణ

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18న నామినేషన్‌లు స్వీకరిస్తారు. నామినేషన్‌లు దాఖలు చేసిన వారి జాబితాను 19న ప్రకటించనున్నారు. 21న నామినేషన్‌ల పరిశీలన కాగా 23న సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్‌లు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. 26న నామినేషన్‌ల తుది జాబితా నోటీసు బోర్డుపై ప్రకటించనున్నారు. 28న జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని ఇప్పటికే సభ్యులకు సందేశాలు పంపించారు. కాగా ప్రతి ఏటా జరిగే చాంబర్ ఎన్నికల్లో ఈ దఫా కూడా ప్రస్తుత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులుకు పోటీగా గతంలో చాంబర్ కార్యదర్శిగా వ్యవహరించిన రంగా బాలకృష్ణ అధ్యక్ష బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో కూడా ఆంజనేయులుకు పోటీగా బరిలో దిగి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఈ క్రమంలో 28న జరిగే చాంబర్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

ప్రభావతి ముందస్తు బెయిల్ పిటీషన్ రేపటికి వాయిదా

గుంటూరు(లీగల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐదో నిందితురాలిగా ఉన్న అప్పటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసుకున్న పిటీషన్ డిసెంబరు 11కు వాయిదా పడింది. ఈ కేసులో తాను నిర్దోషినని పేర్కొంటూ తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ ప్రభావతి గుంటూరు జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది మల్లవరపు శేఖర్ బాబు ద్వారా పిటీషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటీషన్‌లో తనను కూడా పార్టీగా చేర్చాలని, తన వాదనలు కూడా వినాలని కోరుతూ రఘురామకృష్ణంరాజు కూడా తన న్యాయవాదులు వీవీ లక్ష్మీనారాయణ, కావూరి గోపీనాథ్‌ల ద్వారా ఇంప్లీడ్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌లు సోమవారం రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా ఎదుట విచారణకు రాగా ప్రభావతి తరపు న్యాయవాది శేఖర్ బాబు వాదనలు వినిపించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితుడైన రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ పోలీసుల తరపున వాదనలు వినిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అయితే ఈ కేసులో దర్యాప్తు అధికారి సెలవులో ఉండటంతో కేసు డైరీ తనకు అందలేదని కోర్టుకు తెలిపారు. ఇంప్లీడ్ పిటీషన్‌లో రఘురామకృష్ణంరాజు తరపు న్యాయవాది కావూరు గోపీనాథ్ తన వాదనలు వినిపించారు. కేసు డైరీ అందకపోవడంతో ముందస్తు బెయిల్ పిటీషన్‌పై వాదనలు సాగలేదు. రఘురామకృష్ణంరాజు వేసిన ఇంప్లీడ్ పిటీషన్‌పై ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేస్తానని న్యాయమూర్తి పేర్కొన్నారు ముందస్తు బెయిల్ పిటీషన్ కూడా 11వ తేదీకి వాయిదా వేశారు.

యాప్ రుణ వేధింపులు... యువతి ఆత్మహత్యాయత్నం

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ యాప్ రుణ వేధింపులు.. యువతి ఆత్మహత్యయత్నానికి దారి తీశాయి. గుంటూరు జిల్లా తెనాలి టు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 7న మిస్సింగ్ కేసు నమోదు అయింది. రూరల్ మండలం కొలకలూరుకు చెందిన యువతి వెన్నెల తెనాలిలోని కంప్యూటర్ షాపులో పని చేస్తూ సినిమాకు వెళుతున్నానని చెప్పి ఈ నెల 5న తిరిగి ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు బంధువులను విచారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ యువతి ఆన్‌లైన్‌లో రుణం రూ.15 వేలు తీసుకుని రూ.50 వేలు వరకు చెల్లించింది. అయినా కూడా ఆన్‌లైన్ యాప్ నిర్వాహకులు ఇంకా చెల్లించాలంటూ వేధింపులకు గురి చేయడం, ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టేస్తామని బెదిరించడంతో శ్రీశైలం వెళ్లి ఆదివారం సాయంత్రం శిఖరం ప్రాంతం నుంచి అడవిలోకి దూకేసింది. అక్కడ పని చేసే సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సాయంత్రం వరకు గాలించిన యువతి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టి ఓ ప్రాంతంలో పడి ఉన్న యువతిని కనుగొన్నారు. ఆమె వద్ద నుంచి సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలిపారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

పెదకూరపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ ప్రాంగణంలో ఈ నెల 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని జీఆర్‌సీఆర్‌కే స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు జి.కవిత సోమవారం తెలిపారు. గుత్తా రత్నచంద్ర రామకోటేశ్వరి మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ పోటీలను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభిస్తారని, విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రోత్సాహక బహుమతులు అందిస్తారని వారు వివరించారు.

ఢిల్లీ పోలీసు పేరిట రూ. 9 లక్షలు స్వాహా

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. పట్టణ సీఐ ఆర్.అహ్మద్ జాని తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీకి చెందిన పాశం నాగేంద్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీకు కొరియర్ పార్శిల్ వచ్చిందనీ, అందులో డ్రగ్స్ ఉన్నాయనీ, మేము ఢిల్లీ పోలీసులమంటూ బెదిరించారు. దీంతో ఆ ఉద్యోగి బెదిరిపోయాడు. బ్యాంక్ వివరాలు మొత్తం తెలుసుకొని 9 లక్షల 84 వేల రూపాయలు స్వాహా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

12న జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ది గుంటూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదిన అండర్-12 బాలుర విభాగంలో జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి డి.రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు అరండల్‌పేట, శ్రీ మాజేటి గురువయ్య హైస్కూల్ మైదానంలో ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు విధిగా ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాలకు 97042 53968 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

15న విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్, శ్రీశారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న పాఠశాల స్థాయి విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీత 15వ అధ్యాయం పూర్తిగా, సుమతీ శతకం 1 నుంచి 10 పద్యాలు, చిత్ర లేఖనం, భక్తి గీతాల పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేర్లను 13తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 89775 85444, 0863 2356444 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు శతక పద్య పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో విశాలాంధ్ర పుస్తక మహోత్సంలో అరసం ఆధ్వర్యంలో విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతక పద్యాలు సందేశాత్మకంగా, పాఠకులకు సులువుగా అర్థమయ్యేలా ఉంటాయన్నారు. తెలుగు సాహిత్యంలో వేమన నుంచి వందలాది కవులు శతక రచన చేసి విశేష కీర్తి పొందారని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు పండితులు కొణతం నాగేశ్వరరావు, బుల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 20న జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్లను గర్తపురి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ రాయపాటి మమత ప్రకటించారు. బాలురు, బాలికలు, మహిళలు, పురుషులు విభాగాల్లో జట్లను ప్రకటించినట్టు తెలిపారు. జట్లకు మేనేజర్‌గా కేఎస్ఎస్ఎన్ రాజు, కోచ్‌గా సురేంద్ర వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ అభినందించారు. పురుషులలో పీ.తులసీరామ్, వై.ప్రభుసాయి, కే.రాజేష్, పీ.రఫీ, పీ యశ్వంత్ సాయి, మహిళలలో పీ.హాసిని, కే సుదీక్షిత, రఫీ మున్నిసా, రుష్పాపెర్నీషా ఫిర్దోస్, మోక్షితారెడ్డి ఉన్నారు. బాలురలో యశ్వంత్‌సాయి, కృష్ణమనోహర్, రుత్విక్, సమన్వయ్, దుర్గానాగవెంకట్, బాలికలలో శాన్వి సుధాకర్, ఎస్కే షరీఫ్, సీహెచ్ యోగితా కృష్ణ, కే.సంజనా ఎంపికయ్యారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నిక

గుంటూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారం బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షుల ఎన్నిక కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ ఎన్నికల కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారిగా ఈదర శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు. మండలంలోని 186 బూత్ నుంచి 197 వరకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీజేపీ పదాధికారి కొక్కెర శ్రీనివాస్ యాదవ్ హాజరుకాగా, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ ప్రతాప ప్రసాద్, మండల అధ్యక్షుడు లంకా రవిశంకర్, రాష్ట్ర పూర్వ మజ్దూర్ సెల్ కార్యదర్శి తిరుమలశెట్టి వెంకటరమణ నాయుడు, తాడువాయి రామకృష్ణ, మండల సహరిటర్నింగ్ అధికారి సాయి, మధు, బాదం శ్రీను పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నేడు, రేపు వైసీపీ నేతల పర్యటన

గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై నియోజకవర్గాల పర్యటనకు వైసీపీ నేతలు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నేతృత్వంలో నేతలు సోమవారం సమావేశమయ్యారు. పార్టీ అధినేత పిలుపు మేరకు రైతుల సమస్యలపై ఈనెల 10, 11న జిల్లాలోని ప్రత్తిపాడు, తాడికొండ, మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఆయా సమస్యలపై 13న కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, షేక్ నూరిఫాతిమా, వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), దొంతిరెడ్డి వేమారెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి తదితరులున్నారు.

20, 23 తేదీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి క్విజ్, స్పెల్‌బీ పోటీలు

గుంటూరు(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ స్కూల్లో ఈనెల 20, 23 తేదీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి క్విజ్‌బీ, స్పెల్‌బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్ రత్తయ్యతో కలిసి ఆయన పోస్టర్స్ ఆవిష్కరించారు. డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పోటీల్లో 8వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఒక్క స్కూల్ నుంచి ఒకటీమ్‌ను అనుమతిస్తామని తెలిపారు. విజేతలకు రెండు విభాగాల్లో వేర్వేరుగా నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9948227362లో సంప్రదించాలని సూచించారు.

ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల తిష్ఠ

- మంచినీళ్లకూ ఇబ్బందులే..
- లోపించిన పారిశుధ్యం
- ఎక్కడపడితే అక్కడ పార్కింగ్‌లు
- పట్టించుకోని అధికారులు



పనిచేయని తాగునీటి కుళాయిలు



అలంకార ప్రాయంగా వాటర్ కూలర్

గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి సామాన్య ప్రయాణికులు సమస్యలతో సతమతమవుతున్నారు. తాగునీరు కూడా కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎన్టీఆర్ బస్టాండ్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ప్లాట్‌ఫామ్‌ల వద్ద పై నుంచి నీరు కారటం, వ్యర్థాలు పేరుకుపోవటంతో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. తాగునీటి కుళాయిలు కూడా సరిగా పనిచేయక 24 గంటలు నీళ్లు కారిపోతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు అందజేసిన వాటర్ కూలర్‌ను అలంకార ప్రాయంగా ఉంచారు. తద్వారా తాగునీటి బాటిల్స్‌ను ప్రయాణికులు దుకాణాల వద్ద కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులను నెలకొల్పుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆవరణలో ప్రైవేటు వాహనాల రాకపోకలు సాగించకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ అవి కొందరికే వర్తిస్తాయనే విధంగా సిబ్బంది వ్యవహ రిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో ఎక్కడికక్కడ పార్కింగ్ చేసినా పట్టించుకోవటం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటంతో కింది స్థాయి సిబ్బంది ఆడిందే ఆటగా, పాడిందే పాటగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డీపీటీవో బస్టాండ్ ఆవరణలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో పార్కు చేసిన వాహనాలు

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- కలెక్టర్ నాగలక్ష్మి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 172 అర్జీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని, ప్రతి ఫిర్యాదుని సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమ స్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 172 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరి ష్కార వేదికకు అధికారులు విధిగా హాజరవ్వాలని ఆదేశించారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో కొంతమంది అధికారులు సంక్షిప్త సమాచారంతో ముగిస్తున్నారని ఇది సరైన విధానం కాదన్నారు. సమస్యను పరిష్కరించిన విధానాన్ని సంపూర్తిగా అర్థమయ్యే రీతితో వివరాలు పొందుపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాదు, సీపీవో శేషశ్రీ, డీఆర్‌పీ, డ్వామా పీడీలు శంకర్, విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, హార్టీ కల్చర్ డీడీ రవీంద్ర, మత్స్యశాఖ ఏడీ గాలిదేముడు, డీఎస్‌వో కోమలి పద్మ, డీఈవో రేణుక, డీసీవో వీరాచారి పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

నా ఆధార్‌తో లింక్ అయిన స్థలాలు తొలగించాలి

నా ఆధార్ కార్డుతో 24 స్థలాలు లింక్ అవ్వడంతో ఇంటిస్థలం, పెన్షన్, ఇతర పథకాలు రావడం లేదని, లింక్ అయిన స్థలాలు తొలగించాలని కోరుతూ స్థానిక 106వ వార్డు సచివా లయం పరిధిలో నివసిస్తున్న షేక్ ముంతాజ్ అర్జీ అందజేశారు. తన భర్త చనిపోవటంతో వితంతు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవటానికి సచివాలయనికి వెళ్లగా ఈ విషయం తెలిసిందన్నారు. ఈ సమస్యపై గతంలో మున్సిపల్ గ్రీవెన్స్ కూడా అర్జీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

వంద శాతం వైకల్యం ఉన్నా పెన్షన్ రావట్లేదు

పూర్తిగా వంద శాతం వైకల్యంతో మంచానికి పరిమితమైన తన కుమార్తె సయ్యద్ అస్మాకి రూ.15వేలు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ స్థానిక చుట్టుగుంట ప్రాంతానికి చెందిన బాధితురాలితో పాటు ఆమె తల్లి కరీమా అర్జీ అందజేశారు. వందశాతం వైకల్యం ఉన్నట్టు సదరం సర్టిఫికెట్, మెడికల్ బోర్డు సర్టిఫికెట్ కూడా ఇచ్చామని అన్నారు. అధికారులు స్పందించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అర్జీ అందజేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా బోర్డును పునరుద్ధరించలేదని అన్నారు. ఆరేళ్లగా దాదాపు 7వేలకు పైగా క్లైయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఎస్‌కే కాశీంవలి, దీవెనరావు పాల్గొన్నారు.

నూనె తీసే యంత్రం ఇప్పిస్తానని చెప్పి మోసం

కోల్డ్ ప్రెస్ ఆయిల్ యంత్రం కొనుగోలు కోసం గుంటూరులోని పీఆర్ఎం ఏజెన్సీకి నగదు చెల్లించినా యంత్రం ఇవ్వకుండా రెండేళ్లుగా తిప్పించుకుంటున్నారని తెలంగాణ, వనపర్తి జిల్లాకు చెందిన దివ్యాంగుడు ఎస్.లక్ష్మన్న అర్జీ అందజేశారు. పొన్నూరు రోడ్డులోని సదరు ఏజెన్సీకి రూ.1,41,600 డీడీ చెల్లించానన్నారు. కానీ 26 నెలలుగా యంత్రం ఇవ్వట్లేదని, అనేకసార్లు ఏజెన్సీ వద్దకి వెళ్లినా స్పందించట్లేదన్నారు.

వసతి దీవెన నిధులను విడుదల చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ అర్జీ అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో శివ, అమరనాథ్, డేవిడ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

- 23 వరకు వారోత్సవాలు
- సైబర్ వేలార్ లఘు చిత్ర పోటీలు
- పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ సతీష్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ సతీష్‌కుమార్, ట్రైయినీ ఎస్పీ దీక్షా, అదనపు ఎస్పీలు తదితరులు

గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఈ నెల 9 నుంచి 23 వరకు జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ వేలార్ - లఘు చిత్ర పోటీలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పోలీస్ కార్యాలయంలో సైబర్ వేలార్ - లఘు చిత్ర పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఆన్‌లైన్ పేమెంట్ సిస్టం ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతున్నాయన్నారు. అదేస్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరిగి, ఎంతోమంది అమాయకుల ధన, మాన, ప్రాణాలను హరిస్తున్నాయన్నారు. ఈ సైబర్ నేరగాళ్ళ బారిన పడకుండా ఉండటానికి ఏకైక మార్గం సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటమేనన్నారు. క్షేత్రస్థాయిలో జిల్లా ప్రజలందరికీ సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలనే సామాజిక బాధ్యతతో జిల్లాలోని తెనాలి, తుళ్లూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ, నార్త్, సౌత్ సబ్ డివిజన్‌ల పరిధిలో ఉన్న విద్యాసంస్థలలో అవగాహన కల్పించే విధంగా సైబర్ వేలార్ అనే ఈ లఘు చిత్ర పోటీలను నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. లఘు చిత్రాలు రూపొందించ డానికి తప్పనిసరిగా గుంటూరు జిల్లాలోని ఆయా విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ లేదా పీజీ చదువుతున్న వారై ఉండాలని, తప్పనిసరిగా 16 నుంచి 22 సంవత్సరాల మధ్య వయసు గల వారై ఉండాలని అన్నారు. ఒక్కో లఘు చిత్రంలో ఆరు నుంచి ఏడుగురు ఉండాలని, లఘు చిత్ర నిడివి కనిష్టంగా 5 నిమిషాలు, గరిష్టంగా 8 నిమిషాల వరకు ఉండాలని, లఘు చిత్రాన్ని తెలుగు, ఇంగ్లిషు భాషల్లో కూడా రూపొందించవచ్చన్నారు. ఈ నెల 20లోపు విద్యార్థులు తాము రూపొందించిన లఘు చిత్రాలను సంబంధిత పోలీస్ సబ్ డివిజన్ అధికారులకు అందజేయాలని సూచించారు. వాటిలో నుంచి 21న మూడు ఉత్తమమైన వీడియో లను ఎంపిక చేసి 22న జిల్లాస్థాయిలో అన్ని సబ్ డివిజన్ల నుండి వచ్చిన వీడియో లలో నుండి మరలా మూడు ఉత్తమమైన వీడియోలను ఎంపిక చేసి 23న ఎంపికైన ముగ్గురు విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని ఎస్పీ తెలిపారు. ఈస్ట్ పరిధిలోని లాలాపేట, కొత్తపేట, పాతగుంటూరు స్టేషన్‌లకు సంబంధించి వివరాలకు 9030101090లో.. వెస్ట్ సబ్‌డివిజన్‌లోని అరండల్‌పేట, పట్టాభిపురం, నగరంపాలెం పరిధిలోని వారు 8688831330లో సంప్రదించాల న్నారు. ఈ కార్యక్రమంలో ట్రైయినీ ఐపీఎస్ దీక్ష, అదనపు ఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, ఎస్‌బీ డీఎస్‌పీ సీతారామయ్య, సీఐలు శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేలో నమోదైతేనే ఇళ్లు మంజూరు

- కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్లు నిర్మించుకునే వారిని నిర్దేశిత మార్గ దర్శకాల ప్రకారం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 డిమాండ్ సర్వేలో నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేలో నమోదైన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేస్తారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాలు, హౌసింగ్ లే అవుట్లలో స్థలాలు ఉన్న వారిని గుర్తించి డిమాండ్ సర్వేలో సచివాలయ ఉద్యోగులు ఖచ్చితంగా నమోదు చేసేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించాలన్నారు. సచివాలయాల పరిధిలో గృహాల మ్యాపింగ్, ఎన్సీడీ సర్వే 100 శాతం వెంటనే పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయి కుమార్, ఉద్యానశాఖ అధికారి రవీందర్‌బాబు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

టెన్నిస్‌లో ప్రాంజుల మరిన్ని విజయాలు సాధించాలి



ప్రాంజులాను సత్కరిస్తున్న పలు క్రీడా సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టెన్నిస్‌లో ఎడ్లపల్లి ప్రాంజుల మరిన్ని విజయాలు సాధించి, దేశం ఖ్యాతి పెంచాలని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక హనుమయ్య నగర్ ఒకటో లైన్‌లోని, వీవీవీ హెల్త్ హబ్‌లో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి ఎడ్లపల్లి ప్రాంజులకు సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రాంజుల జూనియర్ విభాగంలో వింబుల్డన్, ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ టెన్నిస్ పోటీల్లో దేశం తరుఫున పాల్గొని ప్రతిభను కనబరిచారని అన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రాంజులా పాల్గొనడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో వీవీవీ హెల్త్ హబ్ డైరెక్టర్ టీ అరుణ్‌కుమార్, ప్రముఖ వైద్యుడు రసూల్, ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్ శ్రీధర్, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్, నాగరాజు, చరణ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతు ఇచ్చానని కాలు విరగొట్టారు

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పోలీస్ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో కూటమి పార్టీకి మద్దతు ఇచ్చాన నే కారణంతో తనపై వైసీపీ వర్గీయులు దాడి చేసి కాలు విరగొట్టారని తాడికొండ మండలం గరికపాడు గ్రామానికి చెందిన బత్తుల హనుమంతరావు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. కాలు విరగడంతో నడవలేని స్థితిలో వీల్ చైర్‌లో పోలీస్ కార్యాలయానికి వచ్చిన హనుమంతరావు నుంచి అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి ఫిర్యాదు స్వీకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో వైసీపీలో ఉన్న తాను గత ఎన్నికల సమయంలో కూటమికి మద్దతు ఇచ్చానన్నారు. అయితే గత నెల 1న ఇంట్లో తాను, తన భార్య గొడవ పడుతుండగా సంబంధం లేని గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గంగాల వెంకటేశ్వర్లు, కుమార్, హేమలత తదితరులు ఇనుప రాడ్లు, మారణాయుధాలతో తనపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టారన్నారు. వారి దాడిలో తన ఎడమ కాలు విరిగి పోయిందన్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. దీనిపై ఫిర్యా దు చేయగా తాడికొండ పోలీసులు కేసు నమోదు చేశారని, అయితే ఇంతవరకు నిందితు లను అరెస్టు చేయలేదన్నారు. నిందితులు ఇప్పటికీ గ్రామంలోనే తిరుగుతున్నారన్నారు. నడవలేనిస్థితిలో వీల్ చైర్‌లో వచ్చిన హనుమంతరావు ఫిర్యాదు స్వీకరించిన అదనపు ఎస్పీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

కుంగ్‌ఫూ, కరాటేలో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్-2024 చిలకలూరిపేటలో జరిగిన ఈవెంట్స్ పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య (సీబీఎస్ఈ) పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఆకిటి జన్విక‌భగత్ అండర్ 12 విభాగంలో గోల్డ్ మెడల్‌ను, యూకేజీ చదువుతున్న ఆకిటి విప్లవచంద్ర అండర్ 8 విభాగంలో గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు ఇటువంటి ఆత్మరక్షణ, మనోధైర్యాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడే క్రీడల్లో తర్ఫీదు పొందాలని, అలాగే మెరుగైన శిక్షణ ఇచ్చినటువంటి కోచ్ ఎం కిరణ్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం విద్యా ర్థులను ప్రశంసించారు.

విజయసాయిరెడ్డికి మతి భ్రమించింది

- పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి మతి భ్రమించిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి విమర్శించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. లుక్ అవుట్ నోటీసులు ఇచ్చాక కూడా నిస్సిగ్గుగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయటం విజయసాయిరెడ్డికే చెల్లిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిపై విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంలో కుట్రకోణం దాగి ఉందేమోనన్న దానిపై పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. కాకినాడ పోర్టును జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి బెదిరించి రాయించేసుకున్న వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకే మైండ్ గేమ్ ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. చంద్రబాబుపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. వివేకానంద రెడ్డి హత్య జరిగితే, దాన్ని మొదటగా గుండెపోటు అని చెప్పిన విజయసాయిరెడ్డిని కూడా ముద్దాయిగా చేర్చాలన్నారు. ఇప్పటికే కొడాలి నాని, అంబటి, రోజా లాంటి వారి వల్ల తమ పార్టీ కూలిపోయి, 11 సీట్లకు పరిమితమైందని, మరలా వైసీపీ నామరూపాలు లేకుండా పోవటానికి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అంటూ వైసీపీ క్యాడరే విజయసాయిరెడ్డిని ఛీ కొడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో తయారైన నకిలీ మద్యం విషయం కూడా తెరమీదకు రాబోతోందని, మరలా జైలుకు వెళ్లటానికి విజయసాయిరెడ్డి, అతడి అల్లుడు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే మాధవి హెచ్చరించారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరి ష్కారం కోసం నగర పాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజ లు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లా డుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయా లన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని అన్నారు.

సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 47 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 20, ఇంజనీరింగ్ విభాగం 15, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సీఎంవోహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్‌వోలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- ఎన్‌టీఏ నాయకులతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



జీవీ ఆంజనేయులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌టీఏ రాష్ట్ర నాయకులు

గుంటూరు(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో సోమవారం జీవీ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా బదిలీలు చేస్తారని, ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకటరావు, బీ హైమారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎన్‌టీఏ క్రమశిక్షణా సంఘం చైర్మన్ సీహెచ్ సుభాస్‌చంద్రబోస్, ఎస్‌కే అబ్దుల్ ఖలీద్, చింత వెంకటేశ్వరరావు, సీహెచ్ రమణరావు, కే శ్రీనివాసరాజు, రంగాజీ, సాయివిశ్వనాథ్, లలితబాబు, బుజ్జీ, సీహెచ్ సాంబశివరావు పాల్గొన్నారు.

అదానీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి


- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జంగాల అజయ్‌కుమార్



తాలుకా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి: అదానీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అంతేగాక ఆయన ద్వారా లబ్ధి పొందిన వారిపైన కూడా కేసులు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం స్థానిక తాలూకా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అదానికి సహకరించాడని, దీని ఫలితంగా సుమారు 25 ఏళ్ల పాటు లక్షల కోట్ల భారం ప్రజలపై పడిందని అన్నారు. మరో వైపు నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 29 కార్మిక చట్టాలు రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లుగా విభజించాడని దీంతో కార్మికుల భవిత అగమ్యగోచరంగా మారిందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, జి.సురేష్‌బాబు, మంగా శ్రీనివాసరావు, నూతలపాటి చిన్న, జంగాల చైతన్య, కోట్ల మరియాదాసు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో బాలుడిని వదిలి వెళ్ళిన గుర్తు తెలియని వ్యక్తులు



గుర్తు తెలియని బాలుడు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుమారు రెండు సంవత్సరాల వయసు కలిగిన బాలుడిని నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. దీంతో మహిళా ప్రాం గణం సిబ్బంది బాలుడిని తీసుకుని వచ్చి నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో అప్ప గించారు. సదరు బాలుడిని ఏమి అడిగినా మాట్లాడటం లేదని పోలీసులు తెలి పారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే నగరంపాలెం సీఐ వీరా నాయక్‌ను 86888 31336లో గానీ, స్టేషన్‌ను 0863-2234047లో గానీ సంప్రదించాలని కోరారు.

పెదలంకలో మన కడియం


విత్తనాల ద్వారా మొక్కలు వృద్ధి


మొక్కలకు అంట్లు కడుగుతున్న రైతు


అమ్మకానికి సిద్ధం చేసిన పనసమొక్కలు


తైవాన్ జామ మొక్కలు

గతంలో మొక్కలు కావాలంటే తూర్పుగోదావరి జిల్లా కడియంకు వెళ్ళి రైతులు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ఇదంతా రైతులకు దూరా భారం.. ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడం గమనించి.. తొమ్మిదేళ్ల క్రితం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదలంకలో ఓ నర్సరీని వెంకట సురేంద్ర ఏర్పాటు చేశారు. వివిధ రకాల పండ్ల మొక్కలు లభించే ఈ నర్సరీ ద్వారా పలువురికి జీవనోపాధి కూడా లభిస్తోంది. వ్యవసాయంపై మక్కువతో ఈ ఆలోచన చేసిన వెంకటసురేంద్ర, మన ప్రాంతంలోనే నర్సరీ ఏర్పాటు చేశారు.

- 30 ఎకరాల విస్తీర్ణంలో.. 500 రకాల మొక్కలు
- రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు తెలంగాణాకూ మొక్కల సరఫరా
- రైతులకు గిట్టుబాటు ధరకే విక్రయం
- నలభై మందికి జీవనోపాధి

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణగా పేరు గాంచిన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా రైతులు పంటలు సాగుచేస్తుంటారు. ఏడు దశాబ్దాల కాలంలో వ్యవసాయరంగంలో ఎన్నోమార్పులు చోటు చేసుకున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. అందులో భాగంగానే సాంప్రదాయ వ్యవసాయం కంటే ఎక్కువమంది రైతులు ఉద్యాన వ్యవసాయం (హార్టీకల్చర్) వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ విధానంలో పంటల సాగు వలన అధిక పోషక విలువలు, ఖనిజాలు లభిస్తాయి. పర్యావరణ పరి రక్షణకు, పచ్చదనం మెరుగుకు తోడ్పడుతుంది. అంతేగాక, నీటివసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పండ్ల తోటలను సాగుచేయవచ్చు. రాయలసీమతో పాటు కోస్తా జిల్లాల్లో కూడా ఉద్యాన సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదలంక గురించి తెలుసుకోవాలి. పెదలంకకు చెందిన వేములపల్లి వెంకటసురేంద్ర 30 ఎకరాల్లో అధునాత నర్సరీని ఏర్పాటుచేశారు. ఐదు వందలకు పైగా వివిధ రకాల మొక్కలు ఇక్కడ ఉన్నాయి. ఉన్నత విద్యావంతుడు అయిన సురేంద్ర, వ్యవసాయంపై మక్కువతో ఉద్యాన వ్యవసాయంపై మక్కువతో ఈ రంగంలోకి దిగారు.

గతంలో మొక్కలు కావాలంటే తూర్పుగోదావరి జిల్లా కడియంకు వెళ్ళి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ఆలోచన చేసిన వెంకట సురేంద్ర, మన ప్రాంతంలోనే నర్సరీ ఏర్పాటు చేయాలనుకున్నారు. అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచితే, రైతులకు దూరాభారము తగ్గుతుందని, ఇక్కడ నర్సరీ ఏర్పాటు చేస్తే కూలీలకు జీవనోపాధి కల్పించడంతో పాటు ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని భావించారు.

కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో..

కృష్ణానది పరీవాహక ప్రాంతమైన పెదలంక గ్రామాల్లో రైతులు వాణిజ్య పంటలే కాకుండా లాభదాయకంగా ఉండే పండ్ల తోటలను సాగుచేస్తున్నారు. జామ, మామిడి, గంగిరేవు, బత్తాయి, సపోట, వాటర్‌యాపిల్, పుచ్చకాయ, కొబ్బరి, నిమ్మ తదితర పంటలను సాగుచేస్తున్నారు. రెండేళ్ల కష్టపడితే ముప్పై ఏళ్ళపాటు ప్రతి ఏడాది ఆదాయాన్ని పెంపొందించుకునే విధంగా రైతులు ఆలోచన చేస్తున్నారు.

నర్సరీలో పలు రకాల మొక్కలు

నర్సరీలో విత్తనాల ద్వారా మొక్కలను తయారు చేయడంతో పాటు మొక్కలను పెంచేందుకు అంట్లు కట్టి మొక్కలను సిద్ధం చేస్తుంటారు. జామలో 20 రకాల మొక్కలు ఉన్నాయి. వాటిల్లో నాటుజామ అలహాబాద్ సఫే, తైవాన్‌జామ, తైవాన్ పింకు జామ, మధురసఫేరా, దావల్‌సఫేరా, ఫిషర్ సఫేదా లాంటి మొక్కలు నర్సరీలో ఉంచారు.

నేరేడులో రకాలు

నేరేడులో ఏడు రకాలు మొక్కలు ఉన్నాయి. వాటిలో నాటు నేరేడు మొక్కలకు గింజ ఎక్కువ ఉండటంతో గుజ్జు తక్కువగా ఉండటం వల్ల పూర్తిస్థాయిలో నేరేడు పండ్లు తినే పరిస్థితి లేదు. సీడ్‌లెస్ నేరేడులో ఐదు రకాల మొక్కలు ఉన్నాయి. వాటిల్లో ధూబ్‌దాల్, ఏ85, సీడ్‌లెస్ నేరేడు,సీఏఎస్ఎఫ్42 అనే మొక్కల్లో సీడ్‌లెస్‌వి ఉన్నాయి.

మామిడి మొక్కల్లో 20 రకాలు

మామిడిలో 20 రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో బంగినపండ్లు, చిన్నరసాలు, పెద్దరసాలు, పండూరి, కొబ్బరిమామిడి, కొత్తపల్లి, కొబ్బరిదర్శహరి, హిమైల్, కేసర్, అల్ఫాన్స్, అమరాపాని, మల్లిక, పునాసా, కాటిముని, ఎంగ్రిన్ ఆరెంజ్ వంటి రకాలు అందుబాటులో ఉంచారు.

ఐదడుగుల్లో కొబ్బరిమొక్కలు


గతంలో 30 నుంచి 50 అడుగుల కొబ్బరి చెట్లు ఉండేవి. కొబ్బరికాయలు కోయాలంటే నానా ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అందుకు భిన్నంగా ఐదు నుంచి ఏడు, పది అడుగులు లోపే కొబ్బరిచెట్లు ఎదిగేలా, దిగుబడి అధికంగా ఇచ్చే కొబ్బరి చెట్లు అందుబాటులోకి ఉన్నాయి. నాటుకొబ్బరి, గంగాబోండా, కేరళగ్రీన్, మలేషియన్, గంగాబోండా మొక్కలు ఇక్కడ లభిస్తాయి. ఐదడుగుల గంగాబోండా మొక్క రెండేళ్లలో దిగుబడి ఇస్తుంది. మొదటల్లో దిగుబడి తక్కువగా ఉన్నా ప్రతి ఏటా దాని దిగుబడి క్రమేపి పెరుగుతుంది. ఈ మధ్యకాలంలో ఈ తరహా మొక్కలను రైతులు, గృహయజమానులు పెంచుతున్నారు.

వివిధ రకాల పండ్ల మొక్కలు

నర్సరీలో దానిమ్మలో రెండు రకాల మొక్కలు ఉండగా సుఫర్, భగవన్, నాటు దానిమ్మ, హైబ్రీడ్ దానిమ్మ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. సపోట మొక్కల్లో నాటు, పాట సపోట కాలపర్తి, బనానా సపోట, తైలాండ్ సపోటాలతో పాటు వాటర్ యాపిల్‌ల్లో సీడ్‌లెస్ మొక్కలు స్టార్ ఫ్రూట్స్ పులుపు,తీపి మొక్కలు పనస మూడు రకాలు తైలాండ్ పిన్,బారయాన్‌జై33 మొక్కలు విక్రయిస్తున్నారు. టేకుచెట్లు, నిమ్మకాయ మొక్కల్లో బాలాజీ, నాటు, తైవాన్, బత్తాయిలో బత్తాయి, సద్గురి, మల్బాజపా, మల్బాబర్రీ, వీఆర్త్‌నాద్, బ్రెజిల్ బత్తాయి, రేగిపండ్లు, కాశ్మీర్‌యాపిల్, దాల్చినచెక్క, యాలకులు, సీతాఫలం, రామాఫలం, లక్ష్మణఫలం, చింతకాయచెట్లతో పాటు వివిధ రకాల పండ్లమొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు మారేడు చెట్లు, దాల్చినచెక్క వంటి మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి.



భట్టిప్రోలు మండలం పెదలంకలోని నర్సరీలో వివిధ రకాల మొక్కలు


మలేషియన్‌గ్రీన్ కొబ్బరిమొక్కలు


సంవత్సరంపాటు కాచే ఐదడుగుల పునాసా మామిడిమొక్కలు


నర్సరీలో మొక్కలకు నీరుపెడుతున్న సంరక్షకులు

నాణ్యమైన మొక్కలను అందించడమే లక్ష్యం

నర్సరీ యజమాని వెంకటసురేంద్ర


సీడ్‌లెస్ నేరేడు మొక్కలను చూపెడుతున్న రైతు సురేంద్ర

రైతులకు గిట్టుబాటు ధరలో నూటికి నూరు శాతం నాణ్యమైన మొక్కలను అందించటమే నా లక్ష్యం. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా మారుతున్న కాలానుగుణంగా నాటుహైబ్రీడ్ కొత్తరకం మొక్కలను అందించేలా ప్రయత్నం చేస్తున్నాం. 30 ఎకరాల విస్తీర్ణంలో 40 మంది కూలీలతో తొమ్మిదేళ్లుగా నర్సరీ నడుపుతున్నాం. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తెలంగాణా రాష్ట్రానికి కూడా మా నర్సరీ నుంచి మొక్కలు సరఫరా చేస్తున్నాం. మా నర్సరీలో రూ.50 నుంచి రూ.1000 వరకు మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మరో ఎమ్మెల్సీ... వైసీపీకి గుడ్‌బై?

- మండలికి వెళ్లొద్దన్న ఆదేశాలను పాటించని ఏసురత్నం

(5వ పేజీ తరువాయి)

పోలీసు అధికారిగా మహిళలు, ప్రజా జీవితంలో ఉన్నవారి గౌరవాన్ని తగ్గించేలా, హీనంగా అటువంటి పోస్టులు పెట్టే వ్యక్తులు ఏ పార్టీ వారైనా శిక్ష అనుభవించాల్సిందే అని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ మాటలతో వైసీపీ పెద్దలు ఆయనపై మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతమాత్రమే కాకుండా వైసీపీ ఎమ్మెల్సీ ఈ మధ్య కాలంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరైన సమావేశాల్లో కూడా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం వంటి వాటిపై వైసీపీ పెద్దలకు నచ్చనట్లు తెలుస్తోంది.

టీడీపీ నేపథ్యమే...

పల్నాడు జిల్లా గురజాలలో పుట్టిన ఏసురత్నంది మొదట నుంచి టీడీపీ నేపథ్యమే. ఆయన చాలా కాలం పాటు స్వర్గీయ నందమూరి తారకరామారావు, నారా చంద్రబాబు నాయుడు వద్ద సెక్యూరిటీ అధికారిగా పనిచేశారు. వైసీపీ 2019లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సీటు కేటాయించటంతో ఆ పార్టీలో చేరారు. మూడు సార్లు దేశంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ గా పనిచేశారు.ఇప్పుడు వైసీపీ పెద్దల వైఖరిని ఆయన బహిరంగంగానే వ్యతిరేకి స్తున్నట్లు సమాచారం.

అటువైపే చూపు...

జనసేన నేతలు ఇప్పటికే పలుమార్లు ఆయన ఇంటికి వెళ్లి పార్టీలోకి రావాలని కోరినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ కూడా ఆయన గురించి ఇప్పటికే ఆరా తీసినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం రేపో మాపో జనసేనలో చేరే అవకాశం మెండుగా కనిపిస్తున్నది.

సామాన్యులకు అందుబాటులో ఇసుక



- కేవలం లోడింగ్, రవాణ ఛార్జీలు మాత్రమే వసూలు
- దూరాన్ని బట్టి టన్ను రూ.550 నుంచి రూ.575
- ట్రాక్టర్ రూ.4,500, చిన్న లారీ రూ.7500, 10 టైర్ల లారీ రూ.17 వేలు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల క్రితం కొండెక్కి కూర్చున్న ఇసుక ధర దిగొచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో వలే సీనరేజ్ ఛార్జీలు వసూలు చేయకపోతుండడం, స్టాక్‌యార్డులు, రీచ్‌ల వద్ద టీడీపీ కూటమి ప్రభుత్వం పుష్కలంగా ఇసుక అందుబాటులో ఉంచుతుండడంతో ధర నేల చూపులు చూస్తున్నది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా టన్ను రూ. 550కి వచ్చేసింది. బల్క్ ఆర్డర్స్‌కి అయితే టన్ను రూ. 500కే సరఫరా చేయడానికి ఇసుక సప్లయర్లు పోటీ పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు, 10 టైర్ టిప్పర్లు గుంటూరు నగరంలో ఏ మారుమూల ప్రాంతానికి అయినా వస్తుండడంతో డిమాండ్ అనేది ఇప్పుడు లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంతో పోల్చుకొంటే దాదాపుగా 50 శాతం వరకు ఇసుక ధర తగ్గినట్లు బిల్డర్లు చెబుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకపై సీనరేజ్ వసూలు చేయడంతో సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. ఒక దశలో పెద్ద లారీ ఇసుక రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు కూడా వసూలు చేశారు. దాంతో భవన నిర్మాణ రంగం కుదేలైపోయింది. వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడి ఆందోళనలు నిర్వహించారు. అయినప్పటికీ ఇసుకని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురాకుండా బడా సంస్థలకు కాంట్రాక్టులు ఇచ్చింది. మరోవైపు ఎన్నికలకు ఏడాది ముందు నుంచే జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లను అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు చెరబట్టి రూ. కోట్లు పోగేసి తాడేపల్లి క్యాంపు ఆఫీసుకు చేరవేశారు. ఎన్నికల్లో ఓటర్లకు ఆ నగదుని పంచి గెలుపొందాలని చూశారు. అయితే ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుకపై ఎలాంటి సీనరేజ్ లేకుండా చేసింది. అయితే స్టాక్‌యార్డుల్లో ఉన్న నిల్వలు అయిపోవడం, ఆ వెంటనే కృష్ణానదికి నెలల తరబడి వరద ప్రవాహం కొనసాగినందున నెల క్రితం వరకు కూడా ధర అందుబాటులో లేకుండా పోయింది. అయితే ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టి ట్రాక్టర్లు, యడ్లబండ్లు వాగులు, వంకల వద్దకు వెళ్లి ఇసుక సొంతంగా తెచ్చుకొనేలా అనుమతులు మంజూరు చేసింది. మరోవైపు రీచ్‌ల వద్ద కూడా పుష్కలంగా ఇసుకని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో దాదాపుగా టన్ను రూ. వెయ్యికి పైగానే ధర ఉండగా నేడు సగానికి సగం దిగి వచ్చింది. ట్రాక్టర్‌లో దాదాపుగా 6 టన్నుల వరకు ఇసుకని పోసుకొచ్చి రూ. 4,500లకే గుంటూరు నగరంలో అన్‌లోడింగ్ చేస్తున్నారు. లారీలలో 11 నుంచి 12 టన్నుల ఇసుకని లోడింగ్ చేసి రూ. 7500లకు డోర్ డెలివరీ చేస్తున్నారు. 10 టైర్ల టిప్పర్‌లలో ఏకంగా 30 టన్నుల ఇసుకని నింపి తీసుకొస్తున్నారు. ఇవి ఎక్కువగా బిల్డర్లు బుకింగ్ చేసుకొంటున్నారు. రూ. 17 వేలకే టిప్పర్లు సరఫరా చేస్తున్నారని బిల్డర్లు తెలిపారు. దీంతో నిర్మాణ రంగం మళ్లీ ఊపందుకొన్నది. ఇటీవలే శంకుస్థాపనలు పెద్ద సంఖ్యలో గుంటూరు నగరంలో జరిగాయి. వాటన్నింటిలో ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దీనంతటికి కారణం ఇసుక ధర అందుబాటులోకి రావడమే.


15న జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా విజయవాడ రాక

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా ఈ నెల 15వ తేదీన విజయవాడ రానున్నట్లు ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14,15 తేదీల్లో విజయవాడలో ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు విజయవాడలోని సిద్దార్థ అకాడమీ, రెండో రోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4.30 నిమిషాల వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీ య ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కే శ్యామ్‌ప్రసాద్, సమరస త సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్. పరశురాం, రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య హాజరవుతారని వెల్లడించారు.

10 శాతం గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ పూర్తి

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 10 శాతం గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ పూర్తి అయింది. గత శుక్రవారం ప్రారంభమైన ఈ సదస్సులు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కలిపి సోమవారం సాయంత్రానికి 84 గ్రామాల్లో పూర్తి అయ్యాయి. బాపట్ల జిల్లాలో 277 గ్రామాలకు 35, గుంటూరులో 198 గ్రామాలకు 16, పల్నాడు జిల్లాలో 366 గ్రామాలకు 33 చోట్ల సదస్సుల నిర్వహణ పూర్తి అయినట్లు ప్రభుత్వం గణాంకాలను విడుదల చేసింది. వీటికి స్పందన బాగా ఉన్నట్లు ప్రకటించింది. బాపట్ల జిల్లాలో 4360, గుంటూరులో 1850, పల్నాడు జిల్లాలో 7260 మంది ప్రజలు ఈ సదస్సులకు హాజరై భూములకు సంబంధించిన పత్రాలు, మ్యాపులు పరిశీలించారు.

సాగర్ ప్రాజెక్టుకు 69 వసంతాలు పూర్తి


నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ (ఫైల్)

- డిసెంబరు 10న అప్పటి ప్రధాని నెహ్రూ శంకుస్థాపన
- కుడి, ఎడమల కాలువలతో తెలుగు రాష్ట్రాలకు నీరు
- విద్యుత్ ఉత్పత్తిలోనూ కీలక భూమిక
- మానవ శ్రమ నిర్మిత కట్టడంగా ఖ్యాతి

తెలుగు రాష్ట్రాల ప్రజల జీవనధారగా ఖ్యాతి గడించి.. వేలాది మంది ప్రజలు, రైతుల శ్రమశక్తితో నిర్మితమైన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి ఈ ఏడాది డిసెంబరు 10వ తేదీ నాటికి 69 వసంతాలు పూర్తయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా.. రైతుల పాలిట కల్పతరువుగా విరాజిల్లుతున్న నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి 10-12-1955న అప్పటి మన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. సాగు, తాగునీటి అవసరాలను తీర్చడమే కాకుండా విద్యుత్ ఉత్పత్తిలోనూ కీలక భూమిక పోషిస్తూ బహుళార్థ సాధక ప్రాజెక్టుగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు పేరు గడించింది.

డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ రూపకల్పనకు ఆనాటి ప్రముఖ ఇంజనీర్ కేఎల్ రావు, ముత్యాల జమీందార్ మహేశ్వరప్రసాద్‌ల ఆలోచనలే మూలమని చెప్పవచ్చు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వేలాది మంది శ్రమజీవుల శ్రమశక్తి, వందలాది మంది ప్రాణార్పణలు నేటికీ మరువలేనివి. ఈ ప్రాజెక్ట్ 1970లో నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. డ్యాం నిర్మాణ దశలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ మొట్టమొదటి చీఫ్ ఇంజనీరుగా పనిచేసిన మీర్ జాఫర్ అలి నిబద్ధత కొనియాడదగింది. ప్రపంచ రాతి నిర్మాణాల ప్రాజెక్టుల్లో కెల్లా నాగార్జున సాగర్ డ్యాం పొడవు, ఎత్తుల్లో ప్రథమస్థానంలో ఉండడం గమనార్హం. నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు, ఇది 285 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి 408 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంది. గత ఐదు దశాబ్దాలుగా వచ్చిన వరదలకు రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో సాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 312 టీఎంసీలుగా ప్రభుత్వం నిర్ధారించింది. అంటే సుమారు 96 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని రిజర్వాయర్ కోల్పోయింది.

● జవహర్ కెనాల్ ..

కుడి కాలువకు ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబరు 10న శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ కాలువకు ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న నీటిని విడుదల చేసి జాతికి అంకితమిచ్చారు. దీనిని జవహర్ కెనాల్ అని పిలుస్తారు. ఈ కాలువ గుంటూరు, ప్రకాశం జిల్లాలో సుమారు 203 కి.మీ. ప్రవహిస్తూ రైతన్నల ఆశాజ్యోతిగా వెలుగొందుతోంది. ఈ కాలువ కింద 11.74 లక్షల ఎకరాలుకు నీరందుతోంది. ఈ కాలువ కింద ఆయకట్టును 22 బ్లాకులుగా విభజించారు. వీటికి 9 బ్రాంచ్ కెనాల్స్ కలిగి 5342 కి.మీ. పంటలకు నీటిని అందిస్తోంది. దీనికితోడు ఫీల్డ్ ఛానల్స్ ద్వారా 14400 కి.మీ. పంటలకు నీరు అందుతోంది.

● లాల్‌బహదూర్ కెనాల్ ..

జై జవాన్.. జై కిసాన్ అని నినదించిన మాజీ ప్రధాని జ్ఞాపకార్థం సాగర్ ఎడమ కాలువకు లాల్ బహదూర్ కెనాల్ అని నామకరణం చేశారు. ఈకాలువకు 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ బీమ్‌సేన్ సచార్ శంకుస్థాపన జరుపగా, కుడి కాలువతోపాటే ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తోంది. మొత్తం 297 కి.మీ. పరిధిలోని పొలాలకు సాగు నీరు అందుతోంది. దీనికున్న 7 బ్రాంచ్ కాలువల ద్వారా 7722 కి.మీ., ఫీల్డ్ ఛానల్స్ ద్వారా 9654 కి.మీ. పంట పొలాలను సస్యశ్యామలం చేస్తుంది. వీటికి తోడు 26 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలయ్యే నీటితో కృష్ణా డెల్టా ప్రాంత రైతులకు పంటలు పండించేందుకు ఉపయోగకరంగా ఉంది.

● జలవిద్యుత్ కేంద్రాలు

నాగార్జున సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌గా సేద్యపు నీటినే కాకుండా జలవిద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రంగా కూడా ప్రాముఖ్యతను పొందింది. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌పై నిర్మించిన 410 మెగావాట్ల ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, కుడి కాలువపై 90 మెగా వాట్ల జలవిద్యుత్ కేంద్రం, ఎడమ కాలువపై 60 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించారు. వీటికితోడు కుడి కాలువపై హైడల్ పవర్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలో సాగు, తాగునీటితోపాటు విద్యుత్ కొరతను కూడా తీరుస్తోంది.



నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన నాటి దృశ్యం

సాగునీటి సంఘాల ఎన్నికలకు...రేపు నోటిఫికేషన్

(5వ పేజీ తరువాయి)

మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1,2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

కృష్ణా పశ్చిమ డెల్టాలో డీసీల వివరాలు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో మొత్తం 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వాటిల్లో వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, రేపలె, మోర్త్రోట, దుగ్గిరాల, తెనాలి, గోవాడ, కూచిపూడి, పీవీ పాలెం, జాగర్లమూడి, పొన్నూరు-1, పొన్నూరు-2, పొన్నూరు-3, బాపట్ల-1, చేబ్రోలు, బాపట్ల-2, చీరాల, చినగంజాం, తక్కెళ్లపాడు, పల్లపాడులకు ఎన్నికలు జరగబోతున్నాయి.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేశారు. గ్రామల్లో ఒక వైపు రైతులు వరి కోతల బీజీలో ఉండగా మరోవైపు ఎన్నికలు జరుగుతున్నాయి. పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. రానున్న వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగియనున్నది.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు

రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జనవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం చంద్రబాబు ఎన్నికలపై చేసిన కామెంట్స్ నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఏకగ్రీవ ఎన్నికలు జరిగేలా కూటమి కసరత్తు చేస్తోంది. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఈ సారి కూడా అదే స్థాయిలో ఏకగ్రీవాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 2175 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 64 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 86 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 54 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 126 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1611 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

739 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 739 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,375, గరిష్ఠ ధర రూ.11,650, మోడల్‌ధర రూ.11,500 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,280, గరిష్ఠ ధర రూ.11,700, మోడల్‌ధర రూ.11,500 పలికాయి.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

● వాహనాల తనిఖీ అధికారి మల్లీశ్వరి


వాహన రికార్డులను పరిశీలిస్తున్న మల్లీశ్వరి

పెదనందిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులను తరలించే బస్సులపై యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని వాహనాల తనిఖీ అధికారి మల్లీశ్వరి అన్నారు. పెదనందిపాడు - బాపట్ల రహదారిలో నాగులపాడు వద్ద సోమవారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, వసతులు లేని మూడు ప్రైవేటు పాఠశాలల బస్సులకు అపరాధం రుసుం విధించారు. బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని, సీట్ల మేరకే విద్యార్థులను ఎక్కించుకోవాలని, డ్రైవర్‌తో పాటు ఒక హెల్పర్‌ను ఏర్పాటు చేసుకోవాలని, విద్యార్థులను బస్సు ఎక్కే, దిగే సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, గ్రామస్థులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నివారణపై సోమవారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సేవాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విస్తరణ అధికారి డాక్టర్ ఎం రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. దానికి ప్రత్యామ్నాయంగా గోనె సంచులను ప్రకృతి సిద్ధంగా తయారయ్యే ఇతర వనరులను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ వంగా నవీన్ రెడ్డి, అగ్రికల్చర్ కాలేజ్ బాపట్ల ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డాక్టర్ ఏజే సువర్ణలత, ఉప సర్పంచ్ నామ శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు

● కలెక్టర్‌కు ఎస్సీ మహిళల అర్జీ

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ఫలితాలు వచ్చిన సమయంలో కొంత మంది అగ్రకులాల వారు మాపై దాడి చేశారని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామని దీంతో మాపైనే తిరిగి అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఫిరంగిపురం మండలం, గరుడాచలపాలెంకు చెందిన ఎస్సీ మహిళలు కలెక్టర్‌కు సోమవారం అర్జీ అందజేశారు. ఎన్నికల ఫలితాల సమయంలో మాపై వరుసగా దాడులు చేశారని, కేసు పెట్టినా పోలీసులు స్పందించలేదని, దీంతో హైకోర్టులో కేసు వేశామని తెలిపారు. దీంతో అసలు వారు దళితులే కాదని అంటూ మాపైనే అక్రమ కేసులు పెట్టారని వివరించారు. ఈ మధ్యనే విచారణకు వచ్చిన తహసీల్దారుకు మా కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించామని తెలిపారు.

కూటమికి మద్దతు ఇచ్చానని కాలు విరగొట్టారు

పోలీస్ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో కూటమికి మద్దతు ఇచ్చాననే కారణంతో తనపై వైసీపీ వర్గీయులు దాడి చేసి కాలు విరగొట్టారని తాడికొండ మండలం గరికపాడు గ్రామానికి చెందిన బత్తుల హనుమంతరావు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. కాలు విరగడంతో నడవలేని స్థితిలో వీల్ చైర్‌లో పోలీస్ కార్యాలయానికి వచ్చిన హనుమంతరావు నుంచి అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి ఫిర్యాదు స్వీకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో వైసీపీలో ఉన్న తాను గత ఎన్నికల సమయంలో కూటమికి మద్దతు ఇచ్చానన్నారు. అయితే గత నెల 1న ఇంట్లో తాను, తన భార్య గొడవ పడుతుండగా సంబంధం లేని గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గుంగాల వెంకటేశ్వర్లు, కుమార్, హేమలత తదితరులు ఇనుప రాడ్లు, మారణాయుధాలతో తనపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టారన్నారు. వారి దాడిలో తన ఎడమ కాలు విరిగిందన్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేయగా తాడికొండ పోలీసులు కేసు నమోదు చేశారని, అయితే ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. నడవలేనిస్థితిలో వీల్ చైర్‌లో వచ్చిన హనుమంతరావు ఫిర్యాదు స్వీకరించిన ఏఎస్పీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిత్యం నరకయాతనే..

● అడ్డగోలు పార్కింగ్ ● గంటల తరబడి ట్రాఫిక్ జామ్
● ఉండవల్లి కూడలిలో ప్రయాణికుల ఆవేదన


ఉండవల్లి కూడలి వద్ద స్తంభించిన ట్రాఫిక్


రోడ్డుపై ద్విచక్రవాహనాల పార్కింగ్

తాడేపల్లి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉదయం సాయంత్రం అందరూ ఉద్యోగాలు, పనులకు, విద్యార్థులు తమ తమ గమ్యాలకు చేరే సమయాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అదే రాజధాని ముఖద్వారంగా ఉన్న ఉండవల్లి కూడలి ప్రాంతం... నిత్యం ఇదే తంతుతో ట్రాఫిక్ నియంత్రణ లేక అల్లాడుతున్నారు. రోడ్డు మీదకు చొచ్చుకొచ్చిన దుకాణాదారుల ఆక్రమణలు, అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనాలు, అధికారులు పట్టించుకోకపోవడం ఇవన్నీ కారణాలుగా ఉన్నాయి. వీటికి తోడు కూడలిలోనే సినిమా థియేటర్, అమరావతి, సచివాలయం వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ఈ మార్గం ఎక్కువ రద్దీగా ఉంటుంది. అదే సమయంలో ఆర్టీసీ బస్ వచ్చిందంటే ఇక ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోవడం పరిపాటిగా మారింది. ఒకానొక సమయంలో అమరావతి వైపు నుంచి వచ్చే ఉన్నతాధికారుల వాహనాలు సైరన్లు మోగించుకుంటూ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. కనీసం రోడ్ మార్జిన్ దిగడానికి కూడా వీల్లేకుండా పార్కింగ్, తోపుడు బళ్లు, తినుబండారాలు అమ్మే స్టాల్స్ అడ్డంగా పెట్టేశారు. ప్రయాణికులు సకాలంలో ఉద్యోగాలు, పనులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు గైర్హాజరు అయ్యే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు అధికారులు సమన్వయంతో ఆక్రమణలు తొలగించి, అడ్డగోలు పార్కింగ్‌లను నియంత్రించి తమ ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత ఇసుక విధానానికి అడ్డంకులు సృష్టిస్తే కేసులు

● తహసీల్దార్ సుజాత


ట్రాక్టర్ డ్రైవర్లు యజమానులు, ఇసుక లోడు చేసే కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

తుళ్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానానికి అడ్డంకులు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తుళ్లూరు తహసీల్దార్ సుజాత హెచ్చరించారు. ట్రాక్టర్లతో ఇసుక డంప్ చేసి లారీలకు ఎత్తుకొని వ్యాపారం చేస్తామంటే కఠిన చర్యలుంటాయన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, ఇసుక లోడు చేసే ముఠా కూలీలతో ఆమె మట్లాడారు. వారం క్రితం ఉచిత ఇసుక విధానానికి తూట్లు కొడుతున్నారని లింగాయపాలెం, రాయపూడి ఇసుక రీచ్‌ల వద్ద ట్రాక్టర్లు వెళ్ల కుండా ఆమె కందకాలు తవ్వించా రు. స్థానిక అవసరాలకు ఇసుక ఇబ్బంది కలుగుతుందని రాయపూ డి, బోరుపాలెం టీడీపీ అధ్యక్షుడు మూల్పూరి శ్రీనివాసరావు, కట్టా నరసింహారావు తహసీల్దార్ దృష్టికి తీసుకురావటంతో ఈ సమావే శం నిర్వహించారు. సక్రమంగా ఇసుక విధానం అమలు కావడానికి సుజాత కొన్ని సూచనలు చేశారు. ఓవర్ లోడుతో వెళ్లవద్దన్నారు. కూలీలు ఇసుక లోడు చేసినందుకు ట్రక్కుకు రూ.600 మించి తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. స్థానిక అవసరాల నిమిత్తం సమీప గ్రామ సచివాలయంలో తెలపాలన్నారు. కొంతమంది ట్రాక్టర్లతో ఇసుకను డంపింగ్ చేసి లారీలకు లోడు చేస్తూ వ్యాపారం చేస్తున్నారని, అటువంటి వారి వివరాలు ట్రాక్టర్ల వారే ఇవ్వాలని సూచించారు. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు జరిగేందుకు నా యకులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అధిక వేగంతో ట్రాక్టర్లు వెళుతున్నాయని అనేక ఫిర్యాదులు వచ్చాయని, అలా వెళ్లటం జరిగితే ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సూచనలన్నింటిని పాటిస్తామని హామీ పత్రం ఇవ్వాలని తహసీల్దార్ సూచించారు. సమావేశానికి హాజరైన వారందరూ పత్రం రాసి సంతకాలు చేసి తహసీల్దార్‌కు అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● అవగాహనా సదస్సులో ఎస్ఐ మధుపవన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, డిసెంబరు, 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అద్దంకి మధుపవన్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసాలు సర్వసాధారణంగా మారాయని, స్కామర్లు ఎప్పటికప్పుడు ప్రజలు మోసం చేసేందుకు, డబ్బులు కాజేసేందుకు కొత్త కొత్త మార్గాలు కనుగొంటూ ఇప్పుడు కొత్తగా ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్)ను మోసాలకు ఆయుధంగా మార్చుకున్నారు. తక్కువ సమయంలో డబ్బుల సంపాదన, నమ్మకంగా స్నేహం చేయడం, వ్యక్తిగత విషయాలను పంచుకోవడం వల్లనే ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, విద్యార్థులు ముఖ్యంగా లోన్ యాప్స్ మీద జరిగే సైబర్ నేరాలు, ఫేక్ జాబ్స్, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీదుర్గా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన డిమాండ్స్ డే



నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ నేతలు

మంగళగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త పిలుపులో భాగంగా సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన డిమాండ్స్ డే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య మాట్లాడుతూ అదానీ కంపెనీ గ్రూపులపై జరిగిన అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అమానుష దాడులు, సంఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని తిరపతయ్య డిమాండ్ చేశారు. లక్షల కోట్ల అవినీతి చేసిన అదానిని ప్రశ్నించలేని కూటమి ప్రభుత్వం మోదీని చూసి భయపడుతోందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మణిపూర్‌లో మత విద్వేషాలను రెచ్చగొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించడం లేదని, విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించాలని, నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలని, గత ప్రభుత్వ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియో జకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, నేతలు జాన్‌బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా శతవసంతాల పండుగ లాగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో శతవసంతాల ఉత్సవాలను ప్రారంభించారు.

విద్యార్థులకు సులభతర బోధనపై దృష్టి పెట్టాలి : ఎంఈవో


విద్యార్థుల ప్రగతి స్థాయిలను పరిశీలిస్తున్న ఎంఈవో కెన్నడీ

కాకుమాను, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సులభతర విద్యాబోధనపై దృష్టి పెట్టాలని ఎంఈవో కేఏఫ్ కెన్నడీ అన్నారు. మండల పరిధిలోని బీకే పాలెం ఎంపీయూపీ పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. 9, 10 తరగతి విద్యార్థులకు మంగళవారం నుంచి జరిగే ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో పరీక్షకు గంట సమయం ముందు మాత్రమే పరీక్ష పత్రం ఎంఈవో కార్యాలయం నుంచి తీసుకువచ్చి పరీక్షలను నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలి

● సీపీఎం నేతల ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

మంగళగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిడమర్రు టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలని మౌలిక వసతులు కల్పించాలని, బ్యాంకు మేనేజర్ల ఒత్తిళ్లను అరికట్టాలని కోరుతూ నిడమర్రు టిడ్కో గృహాల నుంచి స్థానికులు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిడమర్రు సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో ఉన్న టిడ్కో గృహాలకు సంబంధించి రుణాలు రద్దు చేయాలని టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలంటూ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యరాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు అంకిరెడ్డిపాలెం జడ్పీస్కూల్ విద్యార్థి ఎంపిక

గుంటూరు(విద్య), డిసెంబరు 9 (ఆంధ్ర జ్యో తి): స్థానిక రూరల్ మండల పరిధిలోని అంకిరెడ్డిపాలెం జడ్పీస్కూల్ విద్యార్థి షేక్ రషీద్‌జాయ్ రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సీహెచ్ సరోజిని సోమవా రం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌విజ్ఞాన్ మండల్, ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో జరిగిన కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ్ 2024 పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీకు ఎంపికయ్యాడని గైడ్ టీచర్ జి శాంతిప్రియ తెలిపారు. విద్యార్థిని పాఠశా ల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

శివాలయంలో అన్నదానం

మంగళగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య తర్వాత జరిగే అన్నదాన కార్యక్రమం సోమవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఈ అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. ఈ రోజున మూడు వేల మందికి అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివసత్యనారాయణ, కగ్గా శ్రీనివాసరావు, చిరుమామిళ్ల రంగారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, గూండా రామాంజనేయులు, రెడ్డి వీరరాఘవులు, పంచల శివన్నారాయణ, పాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళపై యువకుడి అత్యాచారం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నిద్రిస్తున్న మహిళపై ఓ యువకుడు అత్యాచారం చేసిన ఘటన ఎంటీఎంసీ పరిధిలోని కొత్తూరులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఒంటరిగా నిసిస్తున్న మహిళపై కొడుకు స్నేహితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సీఐ కళ్యాణ్‌రాజు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. కాగా సోమవారం నిందితుడిని కృష్ణాకెనాల్ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కాగా వైద్యపరీక్షల్లో నిందితుడు అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారణ అయినట్టు సమాచారం.

వైభవంగా ముగిసిన తెప్పోత్సవం


తెప్పోత్సవానికి విగ్రహాలతో వెళుతున్న కోయ శేఖర్, గ్రామపెద్దలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడులో శ్రీకోదండ రామ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవాలను గ్రామస్థులు, స్థానిక పెద్దల సహాయ సహకారాలతో కిట్స్ కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ తదితరులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించారు. ముగింపు కార్యక్రమ తెప్పోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. వారం రోజులుగా జరుగుతున్న 60వ సప్తాహ మహోత్స వాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి కోదండరామ స్వామి తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత దేవాలయ ప్రాంగణం నుంచి స్వామి మూల విరాట్ విగ్రహాలను మంగళవాయిద్యాలతో నిర్వాహకులు, భక్తులు ఊరేగింపుగా స్థానిక మంచినీటి చెరువు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై విగ్రహాలను ఏర్పాటు చేశారు. తెప్పోత్సవం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాల నుంచి భారీసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఉదయం లక్ష్మీనరసింహ స్వామి వారి హోమాన్ని స్థానిక ఎంపీటీసీ దంపతులు సుజాత, సాంబశివరావులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త లక్ష్మీకాంతారావు గుండెపోటుతో మృతి

మంగళగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఇందిరానగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త గోలి లక్ష్మీకాంతారావు శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన వయస్సు 74 సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. సుమారు రెండున్నర దశాబ్దాల నుంచి పలు ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజలకు సుపరిచితులు. ఆయన మృతికి పలువురు మంగళగిరివాసులు, అభ్యుదయ వాదులు సంతాపం వ్యక్తం చేశారు.

రాబోయే రోజుల్లో వైసీపీ ఉనికే ఉండదు

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్
● టీడీపీలో చేరిన 40 మంది వైసీపీ కార్యకర్తలు


ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన పెదపరిమికి చెందిన వైసీపీ కార్యకర్తలు

తుళ్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలు, నాయకులు ఒక్కొక్కరుగా వీడిపోతున్నారని.. రాబోయే రోజుల్లో ఆ పార్టీ ఉనికే ఉండదని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం గుంటూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు 40 మంది, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, పోతుగుంట నర్సయ్య నేతృత్వంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన చూసి జీవితంలో ఆ పార్టీకి ఓటు వేయకూడదని ఓటర్లు నిర్ణయించుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న మంచి పాలన చూసి వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు. సమర్థుడైన పాలకుడు ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అది సీఎం చంద్రబాబుతోనే జరుగుతుందని ప్రజలు నమ్మి కూటమికి 161 స్థానాలు అందించారన్నారు. పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు మెడలో వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజధానిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

● రాయపూడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్
● నేడు పలు గ్రామాల్లో కరెంట్ నిలిపివేత


రాయపూడి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్

తుళ్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఆ శాఖ చర్యలు తీసుకుంటుంది. రాయపూడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 3.15 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 5 ఎంవీఏ (మెగా వోల్ట్ యాంప్స్) ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కారణంగా మంగళవా రం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయపూడి, లింగాయపాలెం, తుళ్లూరు, అబ్బరాజుపాలెం, దొండపాడు, బోరుపాలెం, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని రాయపూడి ఏఈ చిలకరాజు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత


వధూవరులకు పెళ్లికానుక అందజేస్తున్న ఈపూరి బాబు తదితరులు

తాడేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ సుభాని, షమీల కుమారుడు బషీర్ అహ్మద్ - షేక్ తస్మియా వివాహం సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుక సోమవారం అందజేసి వధూవరులకు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, మద్దినేని సుబ్రహ్మణ్యం, షేక్ జానీ, అబ్దుల్ గఫూర్, కొడవటి సురేష్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను అభినందించారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు యువకుల ఎంపిక


టోర్నమెంట్‌కు ఎంపికైన ఫిరంగిపురం క్రీడాకారులు డీ చక్రి, డీ జీవరత్నంలు

ఫిరంగిపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం గ్రామానికి చెందిన బోయపల్లి చెక్రి, దుగ్గెం జీవరత్నంలు సౌత్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కార్యదర్శి వంగివరపు శ్రీనివాసరావులు సోమవారం తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇంటర్ కాలేజి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొని యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 20వ తేదీన కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని వారు తెలిపారు.

అదానీతో ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

● సీపీఎం మండల సమన్వయ కమిటీ

ఫిరంగిపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో అదానీతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అన్నింటినీ రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఫిరంగిపురంలో సత్తెనపల్లి బస్టాప్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, విశాఖ డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, అదానీకి కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని రూ.1750 కోట్లు లంచం తీసుకున్న అవినీతి పరులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భైరగాని శ్రీనివాసరావు, మండల కన్వీనింగ్ కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, వెంకటరెడ్డి, మార్పుల హోచ్‌మెన్, ఆకారపు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పశువులను వదలడంపై వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న అన్నపర్రు గ్రామస్థులు

పెదనందిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీదేవికి అన్నపర్రు గ్రామస్థులు సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని కేఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో అదే గ్రామానికి చెందిన కల్లూరి నాగేశ్వరరావుకు చెందిన గేదెలను వదిలిపెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటలు ఆడే సమయంలో ఆ గేదెలు విద్యార్థుల పైకి వస్తున్నాయని, ఈ విషయం గతంలో పాఠశాల హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ: ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒక అర్జీ వచ్చిందని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి 6 అర్జీలు

తెనాలి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో ఒకటి ఎండోమెంట్‌కి సంబంధించినది కాగా మరొకటి చింతలపూడి, కొలకలూరు డొంక మార్గంలో రాకపోకలకు వచ్చాయన్నారు. మరో రెండు మ్యుటేషన్‌కు, రెండు సర్వేకోసం వచ్చినట్లు వెల్లడించారు. ప్రతి అర్జీని పరిశీలించి నిర్ణీత సమయంలోపు పరిష్కరించేలా చూస్తానని తహసీల్దార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వేదికకు ఏడు అర్జీలు....

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు అందాయి. రెవెన్యూ 2, మున్సిపల్, పోలీసు, మండల పరిషత్, హౌసింగ్, డిఎల్‌పివో శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందాయని కార్యాలయ అధికారులు తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుకరీచ్‌ల్లో ఎస్‌ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కృష్ణా నది నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయాలనికి తరలించడంతో తహసీల్దార్ సిద్ధార్థ రూ.60వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కొల్లిపర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సోమవారం జూదరులపై దాడులు నిర్వహించగా అన్నవరంలంకలో ఐదుగురిని జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం అన్నవరంలంక పంట పొలంలో ఐదుగురు జూదం అడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న 3వేల80 రూపాయల నగదును, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు వెనిగళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో గొర్నేని సూర్యనారాయణ 4వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు కోడళ్లు గొర్నేని వెంకటేశ్వరావు, ప్రదీప్‌కుమార్, సంధ్య, పద్మలత, కుమార్తె లాం ఝాన్సీ కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్కిశెట్టి వెంకటేశ్వరావు, కన్నెగంటి మధు, పఠాన్ కరీముల్లా, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, యార్లగడ్డ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏసీ రూములు ప్రారంభం

పొన్నూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఏసీ రూములు ఈ నెల 11వ తేదీన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా ప్రారంభించనునట్లు ఆలయ ఈవో జీవీ అమర్‌నాథ్ సోమవారం తెలిపారు. రూ.50 లక్షలతో నిర్మించిన ఈ ఏసీ గదులను భక్తుల వసతి కోసం నిర్మించినట్లు చెప్పారు.

నేడు పొన్నూరులో వికలాంగుల సదస్సు

పొన్నూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు దివ్యాంగుల సదస్సు నిర్వహిస్తునట్లు నియోజకవర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురుగుల సాంబశివరావు, కార్యదర్శి రాంబాబునాయక్, సోమవారం తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హాజరు కానునట్లు చెప్పారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ప్రభుత్వానికి తమ సమస్యలు తెలియజెప్పటమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించనునట్లు చెప్పారు. ఈ సదస్సుకు నియోజకవర్గంలోని దివ్యాంగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

12న మాజీ సైనిక సంక్షేమ సంఘ సమావేశం

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనిక సంక్షేమ సంఘ సమావేశం ఈ నెల 12న జరుగుతుందని సంఘ అధ్యక్షుడు జి.బాబురావు తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్జీవో కళ్యాణ మండపంలో నిర్వహించే సంఘ జనరల్ బాడీ సమావేశానికి బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, ఏపీసైనిక్ వేల్ఫేర్ డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి గుణశ్రీ, బీఆర్‌కే చారి పాల్గొంటారని తెలిపారు. మాజీ సైనికులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అభివృద్ధికి నోచుకోని జగ్గడిగుంటపాలెం

- చెరువుచుట్టూ వ్యర్థాలు, కలుషితనీరు
- అమలుకాని వాకింగ్ ట్రాక్ హామీ
- నిరుపయోగంగా చెత్తతరలించే రిక్షాలు
- సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థుల విజ్ఞప్తి





చెరువు వద్ద డంపింగ్‌కు చెత్తను తీసుకువచ్చి వదిలిన రిక్షా, జగ్గడిగుంటపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద గుట్టలుగా పడవేసిన చెత్త సేకరించే రిక్షాలు

తెనాలి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరంగా జగ్గడిగుంటపాలెం చెరువును తీర్చిదిద్దుతామని వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ నెరవేరకుండా పోయింది. ఇచ్చిన మాటమరచి చెరువును వ్యర్థాలకు నిలయంగా మార్చారు. తెనాలికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం జగ్గడిగుంటపాలెం. ఈ గ్రామానికి ఓ చెరువు ఉంది. ఆ చెరువు కూడా పెదరావూరు వెళ్లేందుకు రోడ్డు మార్గానికి ఒక పక్క ఆనుకుని ఉండగా మరో పక్క పంటకాలువ ప్రవహిస్తూ ఉంటుంది. మధ్యలో రోడ్డు ఎంతో ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తుంది. వైసీపీ అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారానికి వచ్చిన అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆ గ్రామంలో చెరువును చూసి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. వాకింగ్ ట్రాక్ వంటివి కూడా ఏర్పాటుచేసి చెరువు అభివృద్ధి పనులు చేపడతానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఆ గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను మరిచిపోయారు. పైగా ఆ గ్రామ పంచాయతీ తీరు మరింతగా ప్రజలను ఆందోళనకు గురిచేసింది. అందుకు గ్రామంలో నుండి వచ్చే అనేక వ్యర్థాలను ఆ చెరువులో వేసి దానిని కలుషితం చేశారు. అప్పట్లో ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో కొన్ని రోజులు నిలుపుదల చేసి తిరిగి చెరువును పూడ్చే ప్రయత్నం చేశారు. అందుకు ప్రధానంగా రోడ్డు పక్కన దాదాపుగా 2 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉండటంతో అప్పటి నేతలు దానిని ఆక్రమించేందుకు ఈ విధమైన కుట్రలకు తెరలేపారన్న ఆరోపణలు కూడా గ్రామస్థుల నుంచి వినిపించాయి. ఐదేళ్ల కాలంలో ఆ చెరువు అభివృద్ధి జరగకపోగా వ్యర్థాలతో నింపడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వాకింగ్‌కి వెళ్లే ప్రజలు సైతం రోడ్లపైనే నడుస్తూ కాలం వెలిబుచ్చుకొచ్చారు. చెరువు పరిసరాల్లో ఉండే నివాసితులకు వ్యర్థాలతో నిండి కలుషితమైన నీరు ఉండటంతో దోమల ఉధృతి, మరో పక్క దుర్గంధం వెదజల్లుతుండటంతో తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గ్రామ పంచాయతీలకు వీధుల వెంట చెత్తను తరలించేందుకు కొన్ని వేల రూపాయలు ఖర్చుచేసి సమకూర్చిన రిక్షాలను చిన్నపాటి మరమ్మతులకే మూలనవేశారు. అవి చెరువు సమీపంలో ఒకటి ఉండగా మిగిలినవన్నీ పంచాయతీ కార్యాలయం ఆనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆరుబయట పడవేశారు. అవి ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టి పూర్తిగా నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వమైన చెరువు వద్ద వ్యర్థాలను వేయకుండా డంపింగ్ యార్డుకు తరలించి ఆ చెరువును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేయాలని, నిరుయోగంగా ఉన్న రిక్షాలను తిరిగి మరమ్మతులు చేయించి గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పట్టణ అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక తదితరులు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక శివాజీచౌక్‌లో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ కమిషనర్‌తో కలసి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి, రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి పనులలో భాగంగా రోడ్లను విస్తరణ చేస్తున్నామని అన్నారు. పెరిగిన జనాబాకు అనుగుణంగా, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి రోడ్ల విస్తరణ చేస్తున్నామని ప్రజలు కూడా సహకరించాలని కోరారు. రోడ్డు అంచనా 125 మీటర్లు 25.50 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ తోట రఘురామ్, మున్సిపల్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, టీపీవో సాంబశివరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

స్వచ్ఛ తెనాలి సాధించాలంటే పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 26వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లో ఉన్న మురుగును, వ్యర్థాలను గమనించి అధికారులను ఎందుకు పూర్తిగా తొలగించలేదని ప్రశ్నించారు. ప్రతి రోజు వ్యర్థాలను తొలగించి మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు వ్యర్థాలను డ్రెయిన్‌లలో వేయరాదని, మూడు బుట్టల విధానాన్ని అనుసరించి పారిశుధ్య కార్మికులకు ఇంటి వద్దనే చెత్తను అందించాలని కోరారు. పట్టణ సుందరీకరణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని, భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిద్దామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ నూర్ ఇస్మాయిల్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఏఈ సునీల్ కుమార్, టీపీవో సాంబశివరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ

పెదకాకాని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పెదకాకాని పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు మంగళగిరి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, పెదకాకాని సర్కిల్ ఇనెస్పెక్టర్ నారాయణస్వామి వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సులో డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి, ఇతరులను అప్రమత్తం చేయాలని, అపరిచిత వ్యక్తుల నుంచి మన సోషల్ మీడియా ఖాతాలకు వచ్చే నోటిఫికేషన్, అభ్యర్థులను అనుమతించవద్దని సూచించారు. పెదకాకాని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సమాజంలో లోన్ యాప్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. మీపేరిట పార్సిల్ వచ్చిందంటూ వచ్చే బెదిరింపు కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సాంకేతికతను వినియోగించి సైబర్ నేరాల నియంత్రణకు విద్యార్థులు యాప్‌ను రూపొందించాలని సూచించారు. సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930కు కాల్ చేయాలని సూచించారు.

చేబ్రోలు ఆర్‌వీఐటీలో...

చేబ్రోలు, డిసెంబరు 9: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చేబ్రోలు ఎస్‌ఐ డి.వెంకటకృష్ణ అన్నారు. చేబ్రోలు ఆర్‌వీఐటీలో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రుల అవగాహన సదుస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ వెంకటకృష్ణ మాట్లాడుతూ సైబర్ మోసాల వలలో యువత చిక్కుకోవద్దని సూచించారు. అపరిచితులతో ఫోన్లు మాట్లాడవద్దని, వీడియో సందేశాలు, ఫొటోలు షేర్ చేయటం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం సైబర్ మోసాలపై ప్రచార వీడియోలు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఆర్ వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ దేశానికి ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ ఆమె తన పదవిని తృణప్రాయంగా త్యజించి మన్మోహన్‌సింగ్‌కు పదవిని కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో పొన్నూరు శశి, ద్వారక శ్రీనివాస్, బుల్లియ్య, శివకుమార్ పాల్గొన్నారు.

20, 23 తేదీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి క్విజ్, స్పెల్‌బీ పోటీలు

గుంటూరు (విద్య), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ స్కూల్లో ఈ నెల 20, 23 తేదీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి క్విజ్ బీ, స్పెల్‌బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్ రత్తయ్యతో కలిసి ఆయన పోస్టర్స్ ఆవిష్కరించారు. పోటీల్లో 8వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 9948227362లో సంప్రదించాలని సూచించారు.

తక్కెళ్ళపాడులో అగ్నిప్రమాదం

పెదకాకాని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు సోమవారం దగ్ధమయ్యాయి. తక్కెళ్ళపాడుకు చెందిన వెంకట్రావు అనే వ్యక్తి గృహోపకరణాలను వాయిదాల పద్ధతిలో ఇచ్చుకుంటూ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని కొంత గృహోపకరణాలను నిల్వచేశాడు. ఆ ఇంట్లో అగ్నిప్రమాదం జరగడంతో సుమారు లక్ష రూపాయల నష్టం జరిగింది. స మాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపుచేశారు.

నిత్యావసరాలు అందజేత

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాంధీచౌక్‌లో సోమవారం క్షయ వ్యాధిగ్రస్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దాతల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రవికుమార్, ఓంకార ప్రసాద్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏటీవోకి సన్మానం

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఏటీవో వల్లూరి సుబ్రహ్మణ్యం దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కవిరాజా పార్కులో జరిగిన కార్యక్రమంలో ఆయన అందించిన సేవలను సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక సేవ చేయాలని సూచించారు. ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి బేతాళ కృష్ణమోహన్, గోపయ్య, మల్లేశ్వరరావు, మాధవరావు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందాయని, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, తహసీల్దార్ జియావుల్ హక్‌లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. టిడ్కో గృహ సముదాయాల సమస్యలపై రెండు అర్జీలు, భూ సర్వే కోసం 1, విద్యుత్ సమస్యలపై 1, నివేశన స్థలం కోసం 1 దరఖాస్తు అందాయని తెలిపారు.

పీఎంఏవై 2.0
డిమాండ్ సర్వేలో నమోదైతేనే ఇళ్లు మంజూరు

- కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్లు నిర్మించుకునే వారిని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 డిమాండ్ సర్వేలో నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేలో నమోదైన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేస్తారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాలు, హౌసింగ్ లే అవుట్లలో స్థలాలు ఉన్న వారిని గుర్తించి డిమాండ్ సర్వేలో సచివాలయ ఉద్యోగులు ఖచ్చితంగా నమోదు చేసేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించాలన్నారు. సచివాలయాల పరిధిలో గృహాల మ్యాపింగ్, ఎస్సీడీ సర్వే 100 శాతం వెంటనే పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయి కుమార్, ఉద్యానశాఖ అధికారి రవీందర్‌బాబు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

పొదుపు రుణాల స్వాహాపై ఫిర్యాదు

పొన్నూరు టౌన్, డిసెంబరు 9: మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో పొదుపు రుణాలను స్వాహా ఘటనపై సోమవారం గ్రామానికి చెందిన పలువురు పొదుపు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓంకార్ గ్రామ సమాఖ్య ఆర్థిక లావాదేవీలు పర్యవేక్షించే యానిమేటర్ దొప్పలపూడి అరుణ మార్చిలో మృతి చెందారు. తాము శ్రీనిధి రికవరీ నగదు రూ.2.50 లక్షలను జూన్ 27న, రూ.84 వేలు 15న, రూ.97,600 జూలై 12న గ్రామ సమాఖ్య నిర్వాహకులకు చెల్లించామని సభ్యులు తెలిపారు. అయితే తాము చెల్లించిన మొత్తంలో రూ.3.26 లక్షలు స్వాహా అయినట్లు గుర్తించామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకొని సొమ్ము రికవరీ చేయాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై రూరల్ ఎస్‌ఐ గండు కిరణ్ దర్యాప్తు ప్రారంభించారు.

‘ఓటు వేయలేదని కక్షగట్టారు’



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయలేదని గ్రామ సర్పంచ్ కక్ష కట్టి భూమిని రాత్రికి రాత్రే చెరువు చేసేశారని ఆరోపిస్తూ రుద్రపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గుడివాడ గ్రామస్థులు సోమవారం గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ సంజన సిన్హాకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తనకు 40 సెంట్ల పొలం ఉందని, ఆ పొలం తనకు తల్లిదండ్రులు నుంచి సంక్రమించిందన్నారు. అయితే సర్పంచ్ యడ్లపాటి రాకేష్ గత పంచాయతీ ఎన్నికల్లో ఆయనకు ఓట్లు వేయలేదన్న కారణంతో తనపై కక్ష పెంచుకొని, జేసీబీతో తన పొలంలో పది అడుగులు తవ్వి చెరువుగా మార్చేశాడన్నారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని ఈ నెల 2న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, సర్పంచ్ ఆ తహసీల్దారును ఆయనకు అనుకూలంగా ఉండేలా నివేదిక ఇప్పించుకున్నారన్నారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు.

31వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు


తెనాలిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డులో సోమవారం టీడీపీ నేతలు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు అహ్మద్ షరీఫ్ స్థానిక నేతలతో కలిసి పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పేద ప్రజల అభ్యున్నతికి పాటుబడుతూనే ఉందన్నారు. రూ.100 చెల్లిస్తే టీడీపీ కుటుంబసభ్యునిగా గుర్తింపు వస్తుందని, ప్రమాదవశాతత్తూ సభ్యత్వదారుడు మరణిస్తే కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా నగదు రూ.5లక్షలు అందుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కో ఆర్డినేటర్ షేక్ దావూద్, మాజీ అధ్యక్షుడు షేక్ రబ్బాని, చుట్టు సాంబయ్య బి.ఆనంద్‌కుమార్, వీరస్వామి, షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌ఆర్ కళాశాలలో
నాక్ బృందం పరిశీలన

తెనాలి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వీఎస్ఆర్, ఎన్‌వీఆర్ కళాశాలను సోమవారం నాక్ బృందం పరిశీలించింది. ముగ్గురు సభ్యుల బృందం కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించి, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాక్ బృందం తమ కళాశాలను నాలుగో పర్యాయం సందర్శించిందని, మెరుగైన గ్రేడింగ్ వస్తుందని ఆశిస్తున్నామన్నారు. కళాశాల వ్యవస్థాపకులు నన్నపనేని వెంకట్రావు ఆశయాలకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతుందని, విద్యార్థులకు అవసరమైన క్రీడా వసతులు కల్పిస్తున్నామని వీటిని కూడా బృందం సభ్యులు గమనించారన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రవీంద్రనాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ సుగుణ, అజయ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా
విద్యను అందించాలి

- ఎంఈవో సాల్మన్‌రాజు



తూములూరు ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తూములూరు, దావులూరు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం మంచిదన్నారు. విద్యార్థుల యొక్క పురోగతిని వారికి తెలియజేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయాలన్నారు. అంతేకాకుండా పాఠశాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలోనే విద్యార్థులు చక్కగా చదువుపై దృష్టిసారిస్తారన్నారు.